

మగ్గం నేస్తున్న కార్మికుడు

బాపూ సంధించిన అస్త్రం..!



ధర్మవరంలో ఏర్పాటు చేసిన 'రాట్నం తిప్పుతున్న బాపూజీ' విగ్రహం

ఖండాంతరాలకు ఖ్యాతి

ధర్మవరం చేనేతల కళానైపుణ్యం అజరామరం. మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అద్భుతడిజైన్లను రూపొందిస్తూ ధర్మవరం పట్టుచీరకు మరింత వన్నె తెస్తున్నారు. ధర్మవరం పట్టుచీర దేశ సరిహద్దులు దాటి ఖండాంతరాలకు వ్యాపించింది. మనిషి వస్త్రధారణ మొదలు పెట్టినప్పట్నుంచి చేనేత నాగరికత ప్రారంభమైందంటే ఎంతటి ప్రాశస్త్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈస్ట్ ఇండియా కంపెనీ ఇక్కడి చేనేత టెక్నాలజీని గుర్తించి వ్యాపారం చేయడానికి ఇండియాకు వచ్చిందంటే చేనేత పరిశ్రమ విశిష్టత ఎంత గొప్పదో ఊహించుకోవచ్చు.

- నేటికీ వన్నె తగ్గని వైనం
- అద్భుత డిజైన్లతో ప్రపంచ వ్యాప్తం
- ధర్మవరం నేతన్నకు ప్రత్యేక గుర్తింపు

చేనేత వస్త్రం..

నేడు జాతీయ చేనేత దినోత్సవం

స్వాతంత్ర్యోద్యమంలో కీలక భూమిక.. ఖాదీ ఉద్యమంతో విదేశీ వస్త్ర బహిష్కరణ

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చేనేత మగ్గం చరిత్ర ఎంతో ఘనం. ప్రతి భారతీయుడికి గర్వకారణం. స్వాతంత్ర్య సమరంలో బాపూ వాడిన అద్భుత అస్త్రం చేనేత వస్త్రం. విదేశీ వస్తు బహిష్కరణలో భాగంగా గాంధీజీ రాట్నం వడికారు. అలా.. ఖాదీ ఉద్యమానికి నాంది పలికారు. తద్వారా ఆ నాడే చేనేత వస్త్రానికి ప్రపంచస్థాయి గుర్తింపు దక్కింది. ఆ తర్వాత అందరి మన్ననలు పొందాయి చేనేత వస్త్రాలు. పట్టు చీరలు అన్ని దేశాల మగువల మనసులు దోచాయి. అంతటి చేనేత అంటేనే గుర్తొచ్చేది ధర్మవరం. పట్టుకేంద్రంగా పేరొంది. ఇక్కడి చేనేతల పనితనానికి ఎవ్వరైనా ఫిదా కావాల్సిందే. కాలం మారినా.. ఎన్నో రకాల వస్త్రాలు మార్కెట్‌లోకి దూసుకొస్తున్నా.. చేనేతకు మాత్రం ఆదరణ తగ్గలేదు. కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ చేనేత వస్త్రాన్ని తిరుగులేని విజేతగా నిలుపుతున్నారు. ముడిసరుకుల ధరలు పెరుగుతున్నా.. మగ్గం గిట్టుబాటు కాకున్నా.. వదలట్లేదు. ధర్మవరం నేతన్నల జీవన విధానంగా మగ్గం మారిపోయింది. వంశపారంపర్య వృత్తిగా చేనేతను భావిస్తున్నారు. ధర్మవరం మగ్గంపై పురుడు పోసుకున్న వస్త్రాలను చూస్తే ఎవ్వరైనా మనసు పడేసుకోవాల్సిందే. 1905 ఆగస్టు 7వ తేదీన మహాత్మా గాంధీ రాట్నం తిప్పి, నూలు వడికి స్వదేశీ వస్త్రాన్ని స్వహస్తాలతో రూపొందించారు. దీంతో ఏటా ఇదే తారీఖున జాతీయ చేనేత దినోత్సవం చేసుకుంటారు. దీంతో గురువారం పట్టుకేంద్రం ధర్మవరంలో పెద్దఎత్తున వేడుకలు చేసుకోనున్నారు.


40 వేలదాకా మగ్గాలు

ఉమ్మడి అనంత జిల్లాలో 40వేలదాకా మగ్గాలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి లక్ష మందికిపైగా నేతన్నలు జీవనం సాగిస్తున్నారు. చేనేతలతోపాటు రీలింగ్, ట్విస్టింగ్, డైయింగ్‌లు, డిజైనింగ్‌ల (మిగతా 6లో..)



చేనేత మగ్గంపై తయారైన పట్టుచీర

చేనేతను వీడుతున్న వైసీపీ గ్రహణం



- నేతన్నపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు
- అమలులోకి ఉచిత విద్యుత్
- లిఫ్టింగ్ మిషన్లు మంజూరు
- జీఎస్టీ చెల్లించనున్న ప్రభుత్వం
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

6

విస్తరిస్తున్న పేకాట

- రాజకీయ అండదండలతో యథేచ్ఛగా నిర్వహణ
- పోలీసు దాడుల్లో లక్షలు పట్టుబడుతున్న వైనం



అరెస్టయిన పేకాటరాయుళ్లు (ఫైల్)

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేకాట జూదం విస్తరిస్తోంది. కొంతమంది మారుమూల గ్రామాలను స్థావరాలుగా మార్చుకుని పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పేకాట స్థావరాల నిర్వాహకులకు రాజకీయ అండదండలు ఉండటంతో మూడు ముక్కలు.. ఆరు షోలుగా జూదం నడుస్తోంది. రాజకీయ ఒత్తిళ్లతోనే పోలీసులు పేకాట జూదాన్ని కట్టడి చేయలేకపోతున్నట్లు సమాచారం. పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసిన ప్రతిసారి లక్షల్లోనే నగదు పట్టుబడుతోంది అంటే ఎంతలా ఆట సాగుతోందో ఊహించుకోవచ్చు. ఇటీవల కాలంలో జిల్లాలో హిందూపురం, పెనుకొండ, కదిరి, నల్లమాడ, బుక్కపట్నం, పుట్టపర్తి గ్రామీణ మండలాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు పెద్ద ఎత్తున దాడులు నిర్వహించారు. పెద్ద మొత్తంలో డబ్బును స్వాధీనం చేసుకుని, పేకాటరాయుళ్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు.

కట్టడికి పోలీసుల యత్నం

పేకాట కట్టడికి పోలీసులు గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. పెద్దఎత్తున డబ్బును స్వాధీనం చేసుకుని, జూదరులను అరెస్టు చేశారు. అటవీప్రాంతాల్లో పేకాట ఆడేవారిని గుర్తించడానికి డ్రోన్‌కెమెరాలను వినియోగిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన మెరుపుదాడుల్లో సుమారు రూ. 4లక్షలకు పైగా నగదును స్వాధీనం చేసుకుని 26 మందిని అరెస్టు చేశారు.

ఉక్కుపాదం మోపుతాం: రత్న ఎస్పీ



జిల్లాలో పేకాట, మట్కాపై ఉక్కుపాదం మోపుతాం. పేకాట ఆడుతూ దొరికితే జైలుకు పంపడం పక్కా. జిల్లాలో ఎవరైనా ఎక్కడైనా పేకాట ఆడినా.. ఆడించినా కఠిన చర్యలు తప్పవు. జిల్లాలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే స్థానిక పోలీసు స్టేషన్ అధికారులకు, డయల్ 100కు సమాచారం అందించాలి.

రోడ్ల మరమ్మతులకు సవరణ ఉత్తర్వులు

(వివరాలు 6వ పేజీలో...)

యథేచ్ఛగా కబ్జా..!

- పరిగి చెరువులో అక్రమ కట్టడాలు
- అనుమతులు లేకుండానే గదుల నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు



ఆర్అండ్‌బీ రహదారిలో లెట్రిన్ పిట్ తవ్వి సిమెంటు కప్పిన దృశ్యం

పరిగి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పరిగి చెరువు ఆక్రమణలకు గురవుతోంది. చెరువులో ఎక్కడబడితే అక్కడ భవనాలు నిర్మించేస్తున్నారు. గల్లీనాయకుల పేర్లు చెబుతూ యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. కనీసం పంచాయతీ అధికారులను సంప్రదించకుండా చెరువులో షెడ్లు ఇతర నిర్మాణాలు పూర్తి చేశారు. ఇటీవల మండల కేంద్రంలోని బీరలింగేశ్వర స్వామి ఆలయం సమీప చెరువు ప్రాంతంలో ఓ వ్యక్తి అనుమతి లేకుండా గదులను నిర్మించాడు. సంబంధిత అధికారులు ప్రశ్నిస్తే నీకేంటి నేను సమాధానం చెప్పేదంటూ దబాయించినట్లు తెలిసింది. కొన్నేళ్ల కిందట ఓ వ్యక్తి చెరువు ప్రాంతం కబ్జాచేసి భవంతిని నిర్మించుకున్నాడు. దీనిపై కొందరు గ్రామస్థులు కలెక్టరేట్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి చర్యలు లేవు. వెంకటాద్రి లేఅవుట్‌లో బిల్డింగ్ యజమాని ఆర్అండ్‌బీ రహదారిలో మరుగుదొడ్డి పిట్‌ను తవ్వేశాడు. నూతనంగా హిందూపురం-పరిగి ప్రధానరహదారి రావడంతో పాత రహదారిని కబ్జా చేశారు. ఈతతంగాన్ని అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోలేదు. దీని వెనుక ముడుపుల బాగోతం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పైడేటి పంచాయతీ కార్యదర్శికి ఇక్కడ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వడంతో తనకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.



చెరువు స్థలంలో నిర్మించిన గదులు

చెరువులో నిర్మాణాలను కూల్చివేస్తాం



చెరువు స్థలంలో అక్రమంగా భవనాలు, గదులు నిర్మించుకున్న విషయం నాకు తెలియదు. నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టా. క్షేత్రస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం. అనుమతి పత్రాలు లేకపోతే కేసులు నమోదుచేసి భవనాన్ని కూల్చివేయడానికి చర్యలు తీసుకుంటాం. బతుకుతెరువు పేరుతో అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదు.

- విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మీయ ట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో బుధవారం యూటీఎఫ్ ధర్మవరం జోన్ నాయకులతో సమావేశమయ్యారు ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులు 15 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారు ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 20వతేదీలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 90309 44717, 9441734907 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో ధర్మవరం జోన్ యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అమ్మా.. ఇక సెలవ్..!

- హరితా క్షమించు... నా టైం ఇక్కడితో అయిపోయింది..
- రూ.35 వేలకు రూ.1.20 లక్షలు కట్టా.. ఇక కట్టలేను..
- బ్యాంకు ఉద్యోగి ఆవేదన
- అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్య
- బ్యాంకులోనే ఉరి
- అప్పుల వేధింపులు అంటూ సూసైడ్ నోట్ (వివరాలు 7వ పేజీలో..)

ప్రత్యామ్నాయానికి పదును..!

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు

కంది, ఆముదం సాగుకు అన్నదాత సన్నద్ధం





↑ బండూరు వద్ద నీట మునిగిన చౌలేకాయ పంట, జె.వెంకటంపల్లి వద్ద ప్రధాన రహదారిపై కలుగోడు చెరువుకు చేరుతున్న వరదనీరు →

అనంతపురం అర్బన్/నెట్‌వర్క్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉపయుక్తంగా మారాయి. ఖరీఫ్ ఆరంభంలో పదును వర్షం లేక ప్రధాన పంట వేరుశనగ అనుకున్న స్థాయిలో సాగు కాలేదు. ఈ వానలకు పదును కావడంతో కంది, ఆముదం విత్తేందుకు రైతులు సిద్ధమయ్యారు.

పంటలకు ఊరట

యల్లనూరు మండలంలో పండ్ల తోటల రైతులకు వర్షాలు ఊరటనిచ్చాయి. చీనీ, అరటి, మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలు బోరుబావుల కింద సాగయ్యాయి. ఈ వర్షాలకు బోరు బావుల్లో నీరు పెరుగుతోంది. రాయదుర్గం మండలంలో చెక్‌డ్యాంలు, పంట కుంటల్లో నీరు చేరింది. గుమ్మఘట్ట మండలంలోని గొల్లపల్లి, 75 వీరాపురం పరిసరాల్లో భారీవర్షం కురవడంతో కలుగోడు చెరువుకు నీరు చేరింది. జె.వెంకటాంపల్లి వద్ద బుధవారం ఉదయం ప్రధాన రహదారిపై వరద నీరు పారడంతో రెండుగంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. బొమ్మనహాళ్ మండలంలో బుధవారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. దీంతో వేదవతి హగరి నదితోపాటు వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. కళ్యాణదుర్గం-బళ్లారి కాజ్‌వేపై నీరు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీధరఘట్ట, గోనేహాళ్, బండూరు, శింగానహళ్లి, కోళగానహళ్లి, లింగదహాళ్ తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. బండూరు, కలుదేవనహళ్లి గ్రామాల వద్ద లోతట్టు ప్రాంతాల్లోని సాగుచేసిన వేరుశనగ, సజ్జ, అనపకాయలు, చౌళేకాయ పంటలు నీట మునిగాయి. బండూరు వద్ద వంక ఉధృతంగా ప్రవహించడంతో విద్యార్థులు బడికి వెళ్లలేదు. ఉద్దేహాళ్ ఉన్నత పాఠశాల, సినిమా థియేటర్ ముందు (మిగతా 6వ పేజీలో..)

తాడిమర్రిలో గరిష్ఠం

జిల్లాలో అత్యధికంగా తాడిమర్రి మండలంలో 54.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా చెన్నేకొత్తపల్లి మండలంలో 3.2 మి.మీ. నమోదైంది. తలుపుల 54.6, ముదిగుబ్బ 48.6, గాండ్లపెంట 48.2, చిలమత్తూరు 39.6, పరిగి 35.4, కదిరి 31.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. నంబులపూలకుంట 26.2, తనకల్లు 18.6, నల్లచెరువు 17.0, గోరంట్ల 15.2, పెనుకొండ 14.4, హిందూపురం 14.2, సోమందేపల్లి 13, అమడగూరు 11.8, ఓడీసీ 10.4, లేపాక్షిలో 10.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 9.8 మి.మీ. వరకూ నమోదైంది.

పల్లెటూరి మొనగాడు

- ఏపీ ఫైర్ సర్వీస్ డీజీగా పెనికలపాటి వెంకటరమణ
- తాడిమర్రి నుంచి రెండో రాష్ట్రస్థాయి అధికారిగా గుర్తింపు

తాడిమర్రి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైర్ సర్వీస్ డీజీగా తాడిమర్రి మండలం మోదుగులకుంట గ్రామానికి చెందిన పెనికలపాటి వెంకటరమణ విజయవాడలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మండలం నుంచి రాష్ట్రస్థాయి పదవి చేపట్టిన రెండో వ్యక్తి వెంకట రమణ. ఇంతకు మునుపు 2016-18 వరకు డీజీపీగా నారసింపల్లి గ్రామానికి చెందిన జాస్తి వెంకటరాముడు పనిచేశారు. మోదుగులకుంట (తిరుమలాపురం) గ్రామానికి చెందిన పెనికలపాటి లక్ష్మమ్మ, నారాయణ దంపతుల మూడో వెంకటరమణ. ఆయన ఒకటి నుంచి పదో తరగతి వరకు తాడిమర్రిలో చదివారు. అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లో గ్రూప్-1కు ప్రిపేర్ అవుతూనే ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1998లో గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపికై, కృష్ణా జిల్లాలో డీఎస్‌ఓగా పనిచేశారు. ఆ తరువాత విశాఖపట్నం రీజనల్ ఫైర్ ఆఫీసర్‌గా సేవలందించారు. హైదరాబాద్ కార్పొరేషన్‌నూ పనిచేశారు. గత ప్రభుత్వ హయాంలో అడిషనల్ డీజీగా ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేశారు. వెంకటరమణ ఉన్నతస్థాయికి ఎదిగినందుకు గర్వంగా ఉందని ఆయన చిన్ననాటి స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.



అగ్నిమాపక శాఖ డీజీగా బాధ్యతలు తీసుకుంటున్న వెంకట రమణ

చాలా సంతోషం..



రాష్ట్ర అధికారిగా మా స్నేహితుడు వెంకటరమణ బాధ్యతలు తీసుకోవడం తాడిమర్రి మండలానికి గర్వకారణం. మాకు చాలా సంతోషంగా ఉంది. మాతో పాటు 10వ తరగతి వరకు పల్లెటూరులో చదివిన వ్యక్తి ఈ రోజు రాష్ట్రస్థాయి అధికారి కావడం చూసి గర్వంగా ఫీలవుతున్నాం.

- మహేశ్వరరెడ్డి, తాడిమర్రి

గర్వకారణం



నా స్నేహితుడు రాష్ట్ర స్థాయి అధికారిగా బాధ్యతలు గర్వంగా ఉంది. చదువుకునే సమయంలోనే వెంకటరమణ మంచి ఉద్యోగం సాధించాలని వెంకటరమణ లక్ష్యంగా పెట్టుకున్నారు. మేమందరం బయట ఆడుకునే సమయంలో తను తరగతి గదిలోనే ఉంటూ చదువుకునేవాడు.

-ప్రసాద్, తాడిమర్రి

కారుణ్యం చూపని వైసీపీ..!

- ఐదేళ్లు కారుణ్య నియామకాలు కల్పించని వైనం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఉద్యోగాలు
- అభ్యర్థుల్లో ఆనందం

(వివరాలు 6లో....)

చేనేతను వీడుతున్న వైసీపీ గ్రహణం



అనంతపురం వైద్యం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత రంగంపైనే అధికంగా ఉపాధి పొందుతున్నారు. ఈ రంగంపై ఆధారపడ్డ వారిని ప్రోత్సహించేలా పట్టు రాయితీ, ఆరోగ్య పథకం, పింఛన్, బ్యాంకు రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించేవి. వాటిని సద్వినియోగం చేసుకుని దేశ, విదేశాలకు చేనత వస్త్రాలను ఎగుమతి చేసేస్థాయికి నేతన్నలు ఎదిగారు. 60 ఏళ్లలోపు వయసుగల చేనేత మరణిస్తే రూ.60 వేల తక్షణ ఆర్థిక సాయం కూడా అందేది. వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్నిరకాల సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో చేనేత రంగానికి గ్రహణం పట్టిందని నేతన్నలు గుర్తు చేసుకుంటున్నారు. కొందరికి మాత్రమే నేతన్న నేస్తం పేరుతో ఏడాదికి రూ.24వేలు చెల్లించి, చేతులు దులుపుకున్నారని మండిపడుతున్నారు. 5 శాతం జీఎస్టీని మోపుతూ నడ్డి విరిచారని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో చేనేత రంగానికి మళ్లీ మంచి రోజులొచ్చాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చేనేత మగ్గాలున్న ఒక్కో కుటుంబానికి నెలకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందించనున్నారు. పవర్‌లూమ్ ఫ్యామిలీకి కూడా 500యూనిట్ల వరకు ఉచితంగా అమలు చేయనున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వమే జీఎస్టీని చెల్లించునుంది. ఈ పథకాలను గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. దీంతో చేనేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని పథకాలు రద్దు...

60 సంవత్సరాల్లోపు వయసు గల చేనేత కార్మికుడు మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ.60వేల తక్షణ ఆర్థిక సాయం అందించేవారు. ప్రత్యేక ఆరోగ్య పథకం కింద ప్రతి చేనేతకు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించేవారు. ఐపీకి రూ.15వేలు, ఓపీకి రూ.7వేల చొప్పున ప్రభుత్వమే భరించేది. చేనేత మగ్గం నేయలేని వృద్ధులకు ప్రత్యేక పింఛన్ వచ్చేది. చేనేత వస్త్రాల తయారీకి అవసరమైన ముడిసరుకు కొనుగోలుకు రాయితీ చెల్లించేవారు. వస్త్రాల అమ్మకాలను ప్రోత్సహించేలా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయించేవారు. 2019లో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం వీటన్నింటినీ రద్దు చేసింది. దీంతో చేనేత రంగం కుదేలైందని నేతన్నలు వాపోతున్నారు.

5,632 కుటుంబాలకు ఉచిత విద్యుత్

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో చేనేత రంగం మళ్లీ పట్టాలెక్కనుంది. చేనేత కుటుంబాలకు ఆర్థిక భారాన్ని తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపింది. ఇందులో భాగంగా జిల్లాలోని 5,632 చేనేత కుటుంబాలకు 200యూనిట్ల చొప్పున ఈనెల 1వ తేదీ నుంచే ఉచిత విద్యుత్ అందిస్తోంది. పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల చొప్పున ఉచితంగా ఇవ్వనుంది. అధికంగా విద్యుత్‌ను వినియోగించుకున్నా నిర్దేశించిన యూనిట్లకు ప్రభుత్వమే బిల్లు చెల్లిస్తుంది. 5శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది.

లిఫ్టింగ్ మిషన్లు, వర్క్‌షెడ్లు...

ఉచిత విద్యుత్, జీఎస్టీతోపాటు నేతన్నలకు మగ్గం పరికరాలను అందజేయనుంది. ఒక్కో మగ్గానికి పవర్ లిఫ్టింగ్ మిషన్ అందజేస్తున్నారు. రూ.1.20 లక్షలతో ప్రభుత్వమే వర్క్‌షెడ్లను మంజూరు చేయనుంది. సొసైటీలో సభ్యులైన నేతన్నల చేనేతల ఉత్పత్తుల అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయానికి థ్రిఫ్టింగ్ ఫండ్ ఇవ్వనుంది. ఆదాయంలో 8శాతం నేతన్న చెల్లిస్తే.. ఆ మొత్తానికి 16శాతం కలిపి రాష్ట్ర ప్రభుత్వమే తిరిగి నేతన్నకు చెల్లించనుంది. ఇలా అనేక రకాల వెసులుబాట్లను రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

10 వేల మంది నేతన్నలు



జిల్లాలో 10వేల మందివరకు నేతన్నలు మగ్గాలు నేస్తున్నారు. 5,632 కుటుంబాలు ఈ రంగంపైనే ఆధారపడ్డాయి. ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనుంది. వర్క్‌షెడ్లు, లిఫ్టింగ్ మిషన్ తదితర పరికాలను ప్రభుత్వం మంజూరు చేయనుంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం అనంతపురంలో నిర్వహించే ర్యాలీకి పెద్దసంఖ్యలో నేతన్నలు, సంఘాల నాయకులు తరలి రావాలి.

-వరప్రసాద్, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి, అనంతపురం

నేతన్నలకు వరం



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలు నేతన్నలకు వరం కానున్నాయి. ఉచిత విద్యుత్ రూపంలో నెలకు రూ.వెయ్యికిపైగా ఆర్థిక సాయం అందినట్లే. రూ.1.25లక్షల వర్క్‌షెడ్, రూ.21వేల విలువైన లిఫ్టింగ్ మిషన్ తదితర పరికరాల రూపంలోనూ చేనేతలకు ఆర్థిక భారం తగ్గనుంది.

-నరసింహులు, శ్రీరామానంద చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



చేనేత బ్యాంకు, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.5లక్షల వరకు నేతన్నలకు వ్యక్తిగత రుణాలివ్వాలి. పట్టురాయితీ, చేనేత పింఛన్లు, లూబ్ బార్డ్, పునకర్ యోజన, ఇంటి స్థలాలు తదితర పథకాలను చేనేత రంగంలోని అందరికీ వర్తింపజేయాలి.

-నీలూరి రుషింగప్ప, జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాయితీలకు మంత్రి మండలి ఆమోదం

పుట్టపర్తి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): చేనేతలకు పలు రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఈ-క్యాబినెట్ భేటీలో చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందించే పథకానికి ఆమోదం తెలిపింది. చేనేత ఉత్పత్తుల జీఎస్టీపై రాయితీ ఇవ్వనుంది. త్రిఫ్ట్ ఫండ్ పథకం అమలుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్.. కింద చేనేత వస్త్రాలకు రాష్ట్రానికి 10 అవార్డులు లభించగా.. మొదటి సారిగా ధర్మవరం పట్టు చీర రాష్ట్ర అవార్డులు గెలుచుకుంది. పుట్టపర్తిలో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టును రెగ్యులర్ ప్రాతిపదికన నియమించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

చేనేత దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరిగేటు వద్ద గల నేతన్న విగ్రహం సమీపంలో జాతీయ చేనేత దినోత్సవం జరపడానికి చేస్తున్న ఏర్పాట్లను ఆర్డీఓ మహేశ్ బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ చేతన్ హాజరవుతారన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీఓతోపాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, తహసీల్దార్ సురేశ్‌బాబు పర్యవేక్షించారు. చేనేత రంగ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని, నేతన్నల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలులో ఉన్నాయని హరీశ్‌బాబు అన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేశ్, నాయకులు

బాపూ సంధించిన అస్త్రం..

చేనేత వస్త్రం..

(5వ పేజీ తరువాయి)

వారు కూడా దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. చేనేత రిజర్వేషన్ చట్టంలోని లొసుగుల వల్ల మరమగ్గాలు విచ్చలవిడిగా వెలసినా.. నేతన్న నేసిన పట్టుచీరకు ఇప్పటికీ గిరాకీ ఉండటం కళానైపుణ్యానికి నిదర్శనం. ప్రస్తుతం నేతన్న నేసిన చీరను కొనుగోలు చేయడానికి వ్యాపారులు పోటీపడుతుండటం విశేషం.

డిజైనింగ్‌లో ఎదురేలేదు..

చేనేత పట్టుచీరకు డిజైనింగ్ ఎంతో ముఖ్యం. నూతన టెక్నాలజీని జోడించి పట్టుచీరల డిజైన్లు రూపొందించడంలో ధర్మవరం డిజైనర్లు పోటీ పడుతున్నారు. డిజైనింగ్‌లో తమకు సాటిలేరని నిరుపించుకుంటున్నారు. ఇప్పటికే మయూరి, పద్మారవింద, స్వర్ణకమలం, బ్రహ్మకమలం, గంధం, త్రీడీ, సుమాంజలి, కళాంజలి తదితర చీరలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఇక్కడి డిజైనర్లు మరో అడుగు ముందుకేసి దేవుళ్లు, దేవతల ప్రతిమలు, జాతీయ, అంతర్జాతీయ నేతలు, ప్రముఖులు, మేధావుల ప్రతిమలను వివిధ రూపాల డిజైన్లను పట్టు వస్త్రంపై రూపొందిస్తున్నారు.

భౌగోళిక గుర్తింపు

ధర్మవరం పట్టుపరిశ్రమ ప్రపంచ ఖ్యాతి గడించడంతో భారత ప్రభుత్వం భౌగోళిక గుర్తింపును 2014లో కల్పించింది. ఇక్కడ తయారుచేసే పావడాలు, పట్టుచీరలకే ఈ గుర్తింపు దక్కింది. ప్రాచుర్యం పొందిన పరిశ్రమను మరింత ప్రోత్సాహించాలన్న ఉద్దేశంతోనే ఈ గుర్తింపు కల్పిస్తారు. నేతన్నలు తయారుచేసిన పావడా, పట్టుచీరకు గుర్తింపునివ్వడం వల్ల పవర్‌లూమ్స్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ధర్మవరం చీరకు పేరు తీసుకొస్తా



పట్టుచీరల డిజైనింగ్‌పై ఉన్న మక్కువతో బెంగళూరు, హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నా. చేనేత కార్మికుడి సత్తాను జాతీయస్థాయిలో చాటాలనుకున్నా. ఇప్పటికే పలు డిజైన్లు రూపొందించి, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నా. ధర్మవరం పట్టుచీరకు మంచి పేరు తీసుకురావాలన్నదే నా చిరకాల కోరిక.

- నాగరాజు, డిజైనర్, ధర్మవరం

మేడం గారు మరి..!

గురుకుల పాఠశాలలో అవినీతి అధికారి

- అక్రమ వసూళ్లలో చెలరేగుతున్న వైనం
- పైసలిస్తే చాలు.. విధులకు రాకున్నా ఓకే
- సీటు డిమాండ్‌ను బట్టి డబ్బు వసూళ్లు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు



గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న రిటైర్ట్ ఉద్యోగి

బత్తలపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాలలో ఓ మేడం అవినీతికి హద్దు లేకుండా పోతోంది. యథేచ్ఛగా సీట్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో పని చేసే ఓ నాన్ టీచింగ్ ఉద్యోగి నాలుగేళ్లుగా విధులకు రాలేదు. కానీ హాజరైనట్లు సంతకాలు మాత్రం ఉంటున్నాయి. ఆ ఉద్యోగి స్థానంలో ఓ రిటైర్డ్ ఉద్యోగిని నియమించుకుని పనులు చేయిస్తున్నారు. ఇందుకుగాను విధులకు డుమ్మా కొట్టిన ఉద్యోగి నుంచి భారీగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈనేపథ్యంలో మూడు నెలల కిందట ఓ నిరుద్యోగి గురుకుల పాఠశాలలో జరుగుతున్న అక్రమ వ్యవహారాలపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. వీటిపై విచారించి, నివేదిక ఇవ్వాలని కింది స్థాయి అధికారులను ఆదేశించినా, వాటిని కూడా తొక్కి పెట్టేశారన్న విమర్శలు ఉన్నాయి.

సొమ్ములిస్తేనే సీటు!

ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలల్లో విద్యనందిస్తూ, సౌకర్యాలు కల్పిస్తోంది. దీంతో ఆ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు మంచి డిమాండ్ ఉంటోంది. ఇదే ఆ మేడంకు కలిసివస్తోంది. తనకు అనుకూలంగా ఉండే పాత విద్య కమిటీలోని ఒకరిద్దరిని బ్రోకర్లుగా ఏర్పాటు చేసుకొని డిమాండ్‌ను బట్టి అడ్మిషన్‌కు భారీగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎవరైనా ఇంత పెద్ద మొత్తమా అని అడిగితే మీరు ఒక సారి ఇస్తే ఆరేళ్ల పైసా ఖర్చు ఉండదు కదా అని దబాయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆమె అడిగినంత ఇచ్చి పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల సిఫార్సులను సైతం బుట్టదాఖలు చేస్తున్నారనే ఆరోపణలు ఆ మేడంపై ఉన్నాయి. కొత్త విద్యా కమిటీని డమ్మీని చేసి, యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్ సహా 16 మంది బోధనా సిబ్బంది ఉన్నారు. 300మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. 5, 6, 7 తరగతులకు రెండేసి సెక్షన్లు ఉన్నాయి. 8, 9, 10 తరగతులకు మాత్రం ఒక్కో సెక్షన్ ఉన్నాయి.

అభివృద్ధి పేరుతో అక్రమ వసూళ్లు

పాఠశాలలో షెడ్లు వేయాలని, మరుగుదొడ్ల మరమ్మతులు చేయించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులతో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వసూలు చేసిన డబ్బులతో ఇప్పటివరకు ఒక్క పని కూడా చేయలేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా విద్యార్థుల తల్లిదండ్రులతో ఒక్కొక్కరి నుంచి రూ.5వేల నుంచి 10వేల వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ఏడాదికి భారీగానే అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఈ వ్యవహారాలన్నీ తెలిసినా మండల విద్యాశాఖ అధికారులు మాత్రం తెలియనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

గుట్టు రట్టు అవడంపై ఫైర్

'మన స్కూల్లో సీట్లు అమ్ముకునే విషయం పాఠశాల పరంగా నీకు నాకు తప్ప మరెవరికి తెలియదు. ఈ విషయం బయటకు ఎలా పొక్కింది? మీరే బయట చెప్పి ఉంటారు' అంటూ ఓ టీచర్‌పై అవినీతి మేడం ఫైర్ అయినట్లు సమాచారం. వారం కిందట ఓ ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి మేడంకు ఫోన్ చేసి, 'మీపై అవినీతి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ ఏడాది ఎవరెవరు పాఠశాలలో చేరారో వారి అడ్రస్సులతో పాటు, మిగిలిన సీట్ల వివరాలు రాత పూర్వకంగా ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈక్రమంలోనే సీట్ల అమ్మకాలకు సహకరిస్తున్న ఉద్యోగిపై మేడం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గురుకుల పాఠశాలలో అవినీతిని నిర్మూలించాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా బత్తలపల్లి పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై మహాత్మాజ్యోతీరావు పూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ జమునను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.



మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల

టమోటా కిలో రూ.47

అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠ ధర రూ.30, సరాసరి ధర రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.



ప్రత్యామ్నాయానికి పదును..!

(5వ పేజీ తరువాయి)

భారీగా నీరు నిలిచింది. నంబులపూలకుంట మండలంలో ఎండుతున్న పంటలకు వర్షం ప్రాణం పోసింది.

కూలిన మిద్దె



కూలిన కదిరెప్ప మట్టి మిద్దె

అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కదిరప్పకు చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కదిరప్ప, ఆయన భార్య అక్కమ్మ బంధువుల ఇంట్లో పడుకున్నారు. దీంతో వారికి ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న సామగ్రి ధ్వంసమైంది. రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధిత కుటుంబం తెలిపింది. ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించింది.

1.42 లక్షల హెక్టార్లల్లో సాగు

ఖరీఫ్‌లో ఈ ఏడాది అనంతపురం జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లులుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు, కంది 55296, పత్తి 44వేలు, ఆముదం 16293, వరి 19466, జొన్న 1719, సజ్జ 2054, మొక్కజొన్న 14653, రాగి 69, కొర్ర 3311, పెసలు 455 హెక్టార్లు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలున్నాయి. కానీ జూన్, జూలైలో వానలు కురవక 1.42 లక్షల హెక్టార్లలో (42 శాతం) మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 49,518 హెక్టార్లు ఉంది. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జ వేశారు. ఈ సారి కంది సాగుకు ఆసక్తి చూపారు. కంది సాధారణ సాగు విస్తీర్ణం 55,296 హెక్టార్లు కాగా.. ఇప్పటి దాకా 55,290 హెక్టార్లల్లో సాగైంది. తాజా వర్షాలకు మరింత విస్తీర్ణంలో పంట సాగయ్యే అవకాశం ఉంది.

కంది సాగు చేస్తా..



నాకు ఐదెకరాల పొలం ఉంది. పదును వర్షం పడకపోవంతో విత్తనం వేయలేదు. జూలై నెలాఖరు ఎదురుచూసినా వర్షం కురవలేదు. కంది విత్తనాలు సిద్ధం చేసుకున్నాను. ఇప్పుడు పదునైంది. తేమ ఆరగానే కంది పంట సాగు చేస్తాను.

-వన్నూరుస్వామి, పి.సిద్ధరాంపురం, ఆత్మకూరు మండలం

ఆశలు చిగురించాయి



నాకు పదెకరాల పొలం ఉంది. ఏటా వేరుశనగ పంట సాగు చేసి నష్టపోతున్నాను. అందుకే గత ఏడాది నుంచి కంది సాగు చేస్తున్నా. ఈ ఏడాది కంది పంటకు అనుకూలమైన వర్షం పడలేదు. అందుకే విత్తనం వేయలేకపోయారు. బీడు పెట్టుకోవాల్సిందే అనుకున్నాను. కానీ రెండు రోజులుగా వర్షం పడుతోంది. తేమ ఆరగానే పదెకరాల్లో కంది పంట వేస్తాను.

-ఓబుళపతి, ఆత్మకూరు

ఈనెల 15 వరకు అదును..



వేరుశనగ సాగుకు అదును దాటిపోయింది. ఈ నెల 15 వరకూ కంది, ఆముదం పంటలు సాగు చేయవచ్చు. ఈ నెల 9 వరకూ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. పొలాల్లో తేమ ఆరిన తర్వాత కంది, ఆముదం విత్తుకోవాలి. ఈ నెల 15 దాటితే కొర్ర, ఉలవ, సజ్జలు, పెసర తదితర పంటలు సాగు చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

-చంద్రాయుడు, కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త

స్కూళ్లకు చేరుతున్న ఆన్సర్‌షీట్లు



యల్లనూరు మండలంలోని పాఠశాలకు అందజేస్తున్న ఆన్సర్ షీట్లు

అనంతపురం విద్య, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో నిర్వహించే పరీక్షలకు సంబంధించిన అసెస్ మెంట్ ఆన్సర్‌షీట్స్ స్కూళ్లకు చేరుతున్నాయి. ఒక్కో విద్యార్థికి ఒక్కో అసెస్‌మెంట్ ఆన్సర్ షీట్‌ను బుక్‌లెట్ రూపంలో ఇవ్వనున్నారు. ఆయాతరగతుల విద్యార్థులు పరీక్షలు ఎప్పుడు పెట్టినా ఈ ఆన్సర్ షీట్ బుక్‌లెట్‌లోనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. విద్యార్థులు పరీక్షలు రాసిన తర్వాత సంబంధిత క్లాస్ టీచర్ ఆన్సర్‌షీట్ బుక్‌లెట్‌లోనే మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. మూల్యాంకనం తర్వాత పిల్లలు రాసిన జవాబులు, టీచర్లు మూల్యాంకనం ద్వారా ఇచ్చిన మార్కులను యాప్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో ఎఫ్‌ఏ-1 పరీక్షలను ఈనెల 11 నుంచి నిర్వహిస్తున్నారు. 11నుంచి 13 వరకు ప్రైమరీస్కూల్ విద్యార్థులకు, 11నుంచి 14 వరకు ఆరు నుంచి పదో తరగతుల విద్యార్థులకు ఎఫ్‌ఏ-1 పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో నూతనంగా ముద్రించిన అసెస్‌మెంట్ ఆన్సర్‌షీట్స్‌బుక్‌లెట్స్‌ను ఎస్‌ఈఆర్టీ విభాగం జిల్లాలకు పంపుతోంది. వచ్చిన ఆన్సర్‌షీట్స్‌ను పాఠశాలలకు విద్యాశాఖ, ఎస్‌ఎస్‌ఏ శాఖల పర్యవేక్షణలోపాఠశాలలకు చేరుస్తున్నారు. ఈకొత్త పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం తీరుపై ఇప్పటికే టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

జడ్పీలో కారుణ్య నియామకాలు

- 13 మందికి అవకాశం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో బుధవారం 13 మందికి కారుణ్య నియామ కాలు కల్పించారు. జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్ నియామక ఉత్తర్వులు అందజేశారు. వారు ఆరేళ్లుగా వేచి చూస్తున్నారు. ఎట్టకేలకు నియామకం కల్పించడంతో హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగాలు పొందినవారు వీరే..

ఉద్యోగి పేరు	నియమించిన స్థానం
మౌనిక రాజకుమారి	విడపనకల్లు ఎంపీపీ కార్యాలయం
యశ్వంత్‌నాయక్	అమరాపురం జడ్పీహెచ్‌ఎస్
స్నేహలత	పేరూరు జడ్పీహెచ్‌ఎస్
అజయ్‌బాబు	గోరంట్ల జడ్పీహెచ్‌ఎస్ (బాలురు)
లోకేష్	రాయదుర్గం ఎంపీపీకార్యాలయం
పవన్	లేపాక్షి ఎంపీపీ కార్యాలయం
సాయి జీవన్	పెనుకొండ ఎంపీపీ కార్యాలయం
చౌడేశ్వరి	రామగిరి ఎంపీపీ కార్యాలయం
వెంకటేష్	శెట్టూరు ఎంపీపీ కార్యాలయం
వంశీకృష్ణ	అనంతపురం ఎంపీపీ కార్యాలయం
విశ్వచైతన్య	వేపకుంట జడ్పీహెచ్‌ఎస్
రాధమ్మ	అనంతపురం, జడ్పీ
సాయిలలిత	అనంతపురం, జడ్పీ

కారుణ్యం చూపని వైసీపీ..!

పెద్దదిక్కును కోల్పోయి రోడ్డున పడినా.. గత వైసీపీ ప్రభుత్వం కనీస కనికరం చూపలేదు. విధుల్లో ఉండగానే ఉద్యోగులు చనిపోవడంతో వారి కుటుంబాలు ఆధారాన్ని కోల్పోయాయి. ఒక్కసారిగా దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. అలాంటి వారికి కారుణ్య నియామకాలు కల్పించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లూ నిరీక్షణ తప్పలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో వారి నిరీక్షణకు తెరపడింది. అర్హతలకు అనుగుణంగా నియామకాలు కల్పించాలని ప్రభుత్వం పలుమార్లు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జడ్పీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించారు. ఖాళీ అయిన జూనియర్ అసిస్టెంట్ స్థానాలను కారుణ్య నియామ కాల ద్వారా భర్తీ చేస్తున్నారు. జిల్లా పరిషత్ పరిధిలో బుధవారం 13 మందికి కారుణ్య నియామకాల కింద జూనియర్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పించారు. వారికి స్థానాలను కేటాయించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఇప్పటికే పలు కేటగిరీల కింద ఈ ఏడాది మూడు సార్లుకారుణ్య నియామకాలు చేపట్టారు. చాలామంది ఆఫీస్ సబార్డినేట్లుగా బాధ్యతలు చేపట్టడానికి సుముఖత చూపకపోవడంతో ప్రస్తుతం ఉన్నవారిలో వారి విద్యార్హతలకు అనుగుణంగా జూనియర్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పిస్తున్నారు. రోస్టర్ మేరకు 13 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్

వారం రోజుల్లో మరో 11 మందికి ..

జూనియర్ అసిస్టెంట్ల కోటా పూర్తి కావడంతో ఇక సీనియారిటీకి అనుగుణంగా కారుణ్య నియామకాల కోసం వేచి ఉన్నవారిలో మరో 11 మందికి జాబితా సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల్లో నియామక ఉత్తర్వుల జారీకి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.


ఐదేళ్లు నిరీక్షించా



కారుణ్య నియామకం కోసం ఐదేళ్లు నిరీక్షించా. నియామక ఉత్తర్వులు ఇవ్వడంతో ఆనందంగా ఉంది. బాధ్యతగా విధులు నిర్వర్తిస్తా.

-రాధమ్మ, జూనియర్ అసిస్టెంట్

ఎన్నో ఇబ్బందులు పడ్డా..



కారుణ్య నియామకం కోసం ఐదేళ్లు నిరీక్షించా. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు భరించా. నియామకం కల్పించడం ఆనందంగా ఉంది.

-సాయిజీవన్, జూనియర్ అసిస్టెంట్

తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలుడు



ఆర్టీసీ క్లర్క్ లక్షుమయ్యతో రిషి

మైదుకూరు రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గుత్తికి చెందిన కావడి సతీష్, రూతుకు కుమారుడు రిషి (12) తల్లిదండ్రులు మందలించడతో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి పారిపోయి మైదుకూరు బస్టాండ్‌కు చేరుకున్నాడు. మంగళవారం రిషి డబ్బులు అడుక్కొంటూ తిరుపతి వెళ్లే బస్సు ఎక్కాడు. అదే బస్సులో ఉన్న ఖాజా తన సెల్‌ఫోన్ పోయిందని, దాన్ని రిషినే తీశాడని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. వారి వెంట ఆర్టీసీ డిపో క్లర్క్ లక్షుమయ్య కూడా వెళ్లాడు. అక్కడ నుంచి ఖాజా తన సెల్‌ఫోన్‌కు పోలీసులతో కాల్ చేయించగా.. అవతలి వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి మీ సెల్‌ఫోన్ తనకు బస్సులో దొరికిందని తెలిపాడు. దీంతో ఖాజా క్షమాపణలు చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆర్టీసీ క్లర్క్ లక్ష్మమయ్య ఆ బాలుడి వద్ద తల్లిదండ్రుల సమాచారం తెలుసుకున్నాడు. వారికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. బాలుడిని పోలీసుల సాయంతో వారి వద్దకు పంపాడు.

రోడ్ల మరమ్మతులకు సవరణ ఉత్తర్వులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఆర్‌అండ్‌బీ, రాష్ట్ర, హైవే రోడ్లు, మేజర్ జిల్లా రోడ్ల మరమ్మతులకు సంబంధించి సవరణ ఉత్తర్వులను ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ బుధవారం విడుదల చేశారు. ఈమేరకు జీఓఆర్టీ నెంబర్ 411 జారీ చేశారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు సంబంధించి అధికారులు అంచనాలు తయారు చేసి ఈఎన్‌సీకి పంపారు. వాటిని సవరిస్తూ, తదుపరి చర్యలకై ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో పామిడి నుంచి వజ్రకరూరు రోడ్డు, కొనకొండ్ల నుంచి ఉరవకొండ రోడ్డు, ఉరవకొండ టౌన్ నుంచి లింక్ రోడ్డు కనెక్టింగ్ కొనకొండ్ల నుంచి ఉరవకొండ రోడ్డు రూ.3.5 కోట్లతో అంచనాలు పంపారు. వీటిని నాబార్డు నిధులతో చేపట్టేందుకు అనుమతులు మంజూరయ్యాయి. దీంతో వీటిని సవరిస్తూ ముస్టూరు నుంచి రామసాగరం, బోరంపల్లి రోడ్డు మరమ్మతులు చేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో మధూడి, రాయాపురం రోడ్డు, బండ్రేపల్లి మీదుగా.. అదే విదంగా ఆర్‌జే రోడ్డు నుంచి జీఎస్ తండా రోడ్డు, హెచ్‌ఆర్ హట్టి మీదుగా.. అగళి నుంచి బొమ్మరసనపల్లి కొండేపల్లి రోడ్డు మీదుగా రూ.2.62 కోట్లతో మరమ్మతు లకు అధికారులు అంచనాలు పంపారు. మొదటి రెండు రోడ్లకు మాత్రమే సవరణ ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

నిధులను పెంచండి: ఎంపీ అంబికా


మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సభ్యులకు ఏడాదికి కేటాయించే నిధులను పెంచడంతోపాటు జీఎస్టీని మినహాయించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం 377 నిబంధనలో భాగంగా ఎంపీ పార్లమెంట్ సమావేశంలో మాట్లాడారు. 2011 నుంచి ప్రతి పార్లమెంట్ సభ్యుడికి ఏడాదికి కేటాయించే (ఎంపీ లాడ్స్) రూ.5 కోట్ల నిధులు ప్రస్తుత రోజుల్లో ద్రవ్యోల్బణం, నిర్మాణ వ్యయాలు, ప్రజా అవసరాల పెరుగుదలతో సరిపోవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, రహదారుల లేమి తదితర సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఏడాదికి కేటాయించే రూ.5 కోట్ల నిధులు ప్రాథమిక అవసరాలకే సరిపోవడం లేదని ఆయన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కేంద్రం అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాల తరహాలోనే ఎంపీ నిధుల ద్వారా చేపట్టే పనులకు జీఎస్టీ మినహాయిం పు కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రతి ఎంపీకి ఏడాదికి రూ.10 కోట్లు నిధులు కేటాయించడంతోపాటు జీఎస్టీని పూర్తిగా మినహాయించా లని విజ్ఞప్తి చేశారు.

సికింద్రాబాద్-మైసూర్ ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి సికింద్రాబాదు- మైసూర్-సికింద్రాబాద్ (వయా గుంతకల్లు) ప్రత్యేక బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాదు-మైసూర్ బైవీక్లీ ప్రత్యేక రైలు (07033) ఈ నెల 8 నుంచి 29 వరకూ సోమ, శుక్రవారాలలో నడపనున్నారు. ఆయా రోజుల్లో సికింద్రాబాదులో రాత్రి 10-10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4 గంటలకు మైసూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (07034) ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకూ బుధ, శని వారాలలో నడుస్తుందన్నారు. ఆయా రోజుల్లో సాయంత్రం 5-20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు సికింద్రాబాదుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యల్హంక, బెంగళూరు కంటోన్మెంటు, కేఎస్ఆర్ బెంగళూరు, కనిగెరి, మండ్య స్టేషన్ల మీదుగా మైసూరుకు చేరుతుందన్నారు.

మస్కా కొట్టిన మాయగాళ్లు

ఓ వ్యక్తిని ఏమార్చి మూడు తులాల బంగారం కాజేసిన దుండగులు

డీ.హీరేహాళ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సహాయం చేస్తున్నట్లు నటించి ఓ వ్యక్తి నుంచి మూడు తులాల బంగారాన్ని కాజేసిన సంఘటన బుధవారం మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక రాంపురం పట్టణానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ ఆంజనేయులు రాయదుర్గానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ తరుణంలో మండలంలోని పాతహడగలి గ్రామం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆంజనేయులును ఆపారు. 'సార్..! ఈ ప్రాంతంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మీ ఒంటి మీద ఉన్న బంగారం మొత్తం తీసి జాగ్రత్తగా ఒక పేపర్‌లో పెట్టుకుని వెళ్లండి' అని చెప్పారు. ఇది నమ్మిన ఆంజనేయులు తన ఒంటి మీద ఉన్న ఒక చైను, రెండు ఉంగరాలను తీశాడు. ఈ సమయంలో ఆంజనేయులుకు సాయం చేస్తున్నట్లు నటించి, ఆ బంగారాన్ని పేపర్లో మడిచి ఆయన ద్విచక్ర వాహనంపై ఉన్న బ్యాగులో ముందువైపు పెట్టి పంపించేశారు. కొంతదూరం వెళ్లిన ఆంజనేయులు అనుమానంతో ఆ పేపర్‌ను విప్పి చూడగా అందులో చిన్న చిన్న రాళ్లగుళికలు ఉండటం గమనించాడు. వెంటనే తిరిగి సంఘటనా స్థలానికి వచ్చి చూడగా అక్కడ ఎవరూ లేకపోవడంతో కంగారుపడ్డాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు. మొత్తం మూడు తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు.

ఫ్రీ బస్సుకు చురుగ్గా చర్యలు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు


అధికారులకు సూచనలు చేస్తున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఈ నెల 15 నుంచి కల్పించేందుకు చురుగ్గా చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన ఆర్టీసీ ఇన్‌చార్జ్ ఆర్ఎం శ్రీలక్ష్మి, డీఎం నాగభూపాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రయాణం పథకాన్ని మహిళలకు పూర్తి లబ్ధిదాయకంగా మార్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి బస్సు షెడ్యూల్, రూట్ మ్యాపింగ్, టిక్కెట్ విధానం, డిజిటల్ ట్రాకింగ్ వంటి అంశాలపై పూర్తి స్పష్టత ఉండాలన్నారు. అనంతరం బస్టాండుతోపాటు డిపో పరిసరాలను ఆయన సందర్శించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను నడపాలన్నారు. బస్టాండు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 732 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

అమ్మా.. ఇక సెలవ్..!

- హరితా క్షమించు... నా టైం ఇక్కడితో అయిపోయింది..
- రూ.35 వేలకు రూ.1.20 లక్షలు కట్టా.. ఇక కట్టలేను..
- సెంట్రల్ బ్యాంకు ఉద్యోగి ఆవేదన
- అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్య
- బ్యాంకులోనే ఉరి
- అప్పుల వేధింపులు అంటూ సూసైడ్ నోట్


రోదిస్తున్న రవికుమార్ భార్య హరిత, కుటుంబీకులు

'అమ్మా.. ఇక సెలవ్. హరితా నన్ను క్షమించు. నేను బతికి మీకు ఎలాంటి లాభం లేదు. పిల్లల్ని, నిన్ను వదిలి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. నేను చేసుకున్న అప్పులే నా పాలిట శాపం అయ్యాయి. నా టైం ఇక్కడితో అయిపోయింది. రూ.50 వేలు అప్పు తీసుకుంటే... రూ.15 వేలు పట్టుకుని రూ.35 వేలు ఇచ్చారు. ప్రతి నెలా రూ.15,000 ఇచ్చాను. వడ్డీ కడుతూ ఇప్పటి వరకూ రూ.1.20 లక్షలు కట్టాను. ఇంక నా వల్ల కాదు.'

ఇవీ అప్పుల బాధలు, వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక ప్రాణం తీసుకున్న బ్యాంకు ఉద్యోగి రాసుకున్న ఆఖరి మాటలు. రూ.35 వేలు తీసుకుంటే... ఇప్పటి వరకూ రూ.1.20 లక్షలు కట్టాడంటే.. వడ్డీ వ్యాపారులు ఏ స్థాయిలో వసూళ్లు చేశారో చెప్పనక్కర్లేదు.


ఉద్యోగి రవికుమార్ (ఫైల్)

అనంతపురం క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక గుత్తి రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి రవికుమార్ (40) అప్పుల బాధలు భరించలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బ్యాంకులోనే ఉరేసుకుని, ప్రాణం తీసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలులోని సీ క్యాంపు ప్రాంతానికి చెందిన సంకుల రవికుమార్ కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి స్థానిక వినాయకనగర్‌లో స్థిరపడ్డాడు. భార్య హరిత, పిల్లలు సూర్యతేజ(13), దీక్షిత(11), వీక్షిత (10) ఉన్నారు. 12 ఏళ్లుగా బ్యాంకులో సబ్ స్టాఫ్(దస్తరీ)గా పనిచేస్తుండేవాడు. బుధవారం ఉదయం 9.45 గంటలపుడు బ్యాంకుకు వెళ్లాడు. కాసేపు అక్కడి ఉద్యోగులతో మాట్లాడాడు. అంతకుముందు భార్యకు ఫోన్ చేసి మనసు బాగోలేదని చెప్పాడు. తర్వాత 9.50గంటలకు బ్యాంకులోని వాష్ రూమ్‌కు వెళ్లి కిటికీకి కొత్తగా తెచ్చుకున్న నైలాన్ తాడుతో ఉరి వేసుకున్నాడు. వాష్‌రూమ్ తలుపులు తీయకపోవడంతో గుర్తించిన బ్యాంకు సిబ్బంది, ఇంటికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో కార్పెంటర్ ఓపెన్ చేసి చూడ గా... ఉరివేసుకుని, మరణించాడు. సమాచారం అందుకున్న త్రీటౌన్ సీఐ శాంతిలాల్, వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీ వేధింపులే..

రవికుమార్‌ను అప్పులు, అధిక వడ్డీ వేధింపులే బలి తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. 35 వేలకు ఇప్పటికే రూ.1.20 లక్షలు కట్టాననీ, ఇక కట్టలేనంటూ సూసైడ్ లెటర్‌లో పేర్కొనడం చూస్తేంటే.. వడ్డీలు కట్టడానికి జీతం చాలట్లేదని స్పష్టమవుతోంది. మరికొందరి వద్ద తీసుకున్న అప్పులు కూడా అతడికి భారంగా మారినట్లు స్పష్టమవుతోంది. రవికుమార్ మూడు రోజులపాటు సెలవు తీసుకున్నాడని బ్యాంకు సిబ్బంది ద్వారా తెలుస్తోంది. సెలవు ముగించుకుని వచ్చీ రాగానే... బ్యాంకు ఉద్యోగులు, కుటుంబీకులను ఒకసారి మాట్లడించి, అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. రవికుమార్ మృతదేహాన్ని వాష్ రూమ్ నుంచీ బయటకు తీయగానే... భార్య హరిత, ఇతర కుటుంబీలు కన్నీరుమున్నీరయ్యారు. తోటి బ్యాంకు ఉద్యోగులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. కొందరు ఉద్యోగులకు నోట మాట రాలేదు. హరిత ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిక వడ్డీలకు అడ్డుకట్ట వేయాలి

అధిక వడ్డీ వేధింపుల కారణంగానే బ్యాంకు ఉద్యోగి రవికుమార్ ఆత్మహత్య చేసుకున్నారని అధిక వడ్డీల వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. రవి మృతదేహాన్ని హరితోపాటు మరికొందరు మార్చురీ వద్ద సందర్శించి, అతడి కుటుంబీకులను ఓదార్చారు. తర్వాత ఆయన మాట్లాడుతూ... నగరంలో వడ్డీ వ్యాపారుల అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. వాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే... ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కాల్‌మనీ కేటుగాళ్లను ప్రభుత్వం, పోలీసులు కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

వేధింపులను అడ్డుకోండి

పేదలను దోచుకుంటున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

అనంతపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపుల నుంచి ప్రజలను కాపాడాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల అవగాహన, మైక్రో ఫైనాన్స్ వడ్డీ వ్యాపారుల నుంచి కాపాడాలంటూ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జిల్లా కోశాధికారి చంద్రిక సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు రమాదేవితోపాటు ఎల్‌డీఎం నరేష్ రెడ్డి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ వాసుదేవరెడ్డి, బ్యాంకింగ్ అధికారి భ్రమరాంబ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదల అవసరాలను ఆసరా చేసుకుని రుణాలిచ్చిన కొన్ని మైక్రో ఫైనాన్స్ కంపెనీలు అధిక వడ్డీలతో దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీర్చలేక ఒత్తిడికి గురై అనేక మంది ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘాల్లో సభులు రుణాలు పొందాలంటే ఆర్పీలు, పై సిబ్బందికి కమీషన్లు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని, ఈ సంస్కృతిని నిర్మూలించాలని కోరారు. అనంతరం ఎల్‌డీఎం నరేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా రుణాలందిస్తున్నాయన్నారు. సబ్సిడీ రుణాలు, విద్య, ఉపాధి, ఆర్థిక అవసరాలకు తక్కువ వడ్డీలతోనే రుణాలు మంజూరు చేస్తున్నాయని తెలిపారు. మెప్మా పీడీ విశ్వజ్యోతి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యులు ఎవరికీ ఎలాంటి కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా కమీషన్లు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. బ్యాంకింగ్ అధికారిని భ్రమరాంబ మాట్లాడుతూ... ప్రజలకు తక్కువ ప్రీమియంతో ఆరోగ్య, ప్రమాద బీమా పథకం అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థల రుణ ఒత్తిళ్లతో చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఏ ష్యూరిటీ లేకుండా రుణాలు ఇచ్చి, నెల కంతు చెల్లించకపోతే గద్దల్లా ఇళ్ల మీదకు వాలిపోయి వడ్డీవ్యాపారులు వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు దృష్టి సారించి ప్రజలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు శ్యామల, నగర అధ్యక్ష కార్యదర్శులు శంషాద్, అశ్విని, నగర నాయకులు గీత, శైలజ, వహీదా, షర్మిబి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య అంశాలపై దృష్టి పెట్టండి

ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించి, అమలు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వివిధ రీతుల్లో వచ్చిన ఫిర్యాదులపై స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్య పరిష్కరించాలన్నారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. పౌరసరఫరాలు, పీజీఆర్ఎస్, ఐవీఆర్ఎస్, చుక్కల భూముల ప్రక్రియ తదితర అంశాలలో పురోగతి సాధించాలన్నారు. తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు ఎఫ్‌పీ షాపులు తనిఖీ చేసి, నిత్యావసర సరుకులు సరిగా అందేలా చూడాలన్నారు. గుంతకల్లు, ఉరవకొండ, బొమ్మనహాళ్, పామిడి, యల్లనూరు, యాడికి మండలాల్లో రీ ఓపెన్ కేసులున్నాయని, వాటిని సత్వరమే పూర్తి చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

1,571 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,571 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైలు వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువులను ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ బుధవారం పరిశీలించారు. యూరియా 754 మెట్రిక్ టన్నులు, డీఏపీ 407 మెట్రిక్ టన్నులు, 20-20-0-23 రకం ఎరువులు 410 మెట్రిక్ టన్నులు జిల్లాకు సరఫరా అయ్యాయయన్నారు. జేసీ ఆదేశాల మేరకు 402 మెట్రిక్ టన్నుల యూరియా ప్రైవేటు డీలర్లకు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు 352 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన ఎరువులను పలువురు ప్రైవేటు డీలర్లతోపాటు మార్క్‌ఫెడ్‌కు కేటాయించామని వెల్లడించారు.

రేపు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి నేపథ్యంలో ఈనెల 8వతేదీన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. అండర్-19 విభాగంలో బాల, బాలికలకు జిల్లాస్థాయిలో పోటీలు అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ఉంటాయన్నారు. గెలుపొందిన వారు జోనల్ స్థాయికి ఎంపికవుతారనానరు. వివరాలకు 9966103956, 08554-353223 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బ్రహ్మసముద్రం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):మండలంలోని భైరవాన్‌తిప్ప గ్రామంలో ఓ బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అడ్డుకున్నారు. వివాహం చేస్తున్నారన్న సమాచారంతో ఐసీడీఎస్ సూపర్ వైజర్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలిక ఇంటికి వెళ్లారు. అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తరువాతనే వివాహం చేయాలని, అతిక్రమించి వివాహం చేస్తే చట్టరీత్యా నేరస్తులవుతారని బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారితో 18 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేస్తామనే అంగీకారపత్రాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామాంజినమ్మ, వీఆర్వో హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి: డీఆర్ఓ



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని నీటి వనరుల ఆక్రమణలను గుర్తించి, చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ మలోల ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జిల్లా స్థాయి నిఘా కమిటీ (వాచ్ డాగ్ కమిటీ) సమావేశంలో పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ఆక్రమణదా రులకు నోటీసులు జారీ చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, నీటి వనరులు, ట్యాంక్ బెడ్స్‌లోని ఆక్రమణల విషయంగా అర్బన్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు సమన్వయంతో బృందంగా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ స్థితిగతులను పరిశీలించాలన్నారు. నీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ 386 ప్రకారం ఇంతకుముందు ఎన్నిచెరువులు, నీటి వనరులు ఆక్రమించారు, వాటిలో ఎన్ని ఆక్రమణలను తొలగించారు తదితర అంశాలకు సంబంధించి సమీక్షించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రిడ్జిపై రాకపోకలు: ఎమ్మెల్యే



అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లి క్రాస్‌లోని పండమేరు పాత బ్రిడ్జిపై గురువారం నుంచి రాకపోకలు పునఃప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడారు. గత ఏడాది అక్టోబరులో భారీ వరదకు బ్రిడ్జి బేరింగులు దెబ్బతిన్నాయని, దీంతో రాకపోకలు నిలుపుదల చేశామని అన్నారు. కేంద్ర రవాణా, రహదారుల శాఖ నిధులు రూ.85 లక్షలు వెచ్చించి, మూడు నెలల్లోనే మరమ్మతులు పూర్తి చేయించామన్నారు.

ఏడు నెలల గర్భిణి ఆత్మహత్య

భర్త మోసం చేశాడని అఘాయిత్యం


మహమ్మద్ వలి, షేక్ షమీమ్ బాను పెళ్లి ఫొటో

గుంతకల్లు/టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోఫియా స్ట్రీట్‌కు చెందిన ఏడు నెలల గర్భిణి షేక్ షమీమ్ బాను (34) బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షమీమ్ బాను పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైంది. తర్వాత ఒంట్లో బాధను భరించలేక స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో ఒక్కతే వెళ్లింది. వైద్యులు ప్రథమ చికిత్స చేస్తుండగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో వారు ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి షమీమ్ బానును అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నం చేశారు. అంబులెన్సు గుత్తి సమీపంలో వెళ్తుండగా షమీమ్ బాను మృతి చెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమె గత నెల 14న గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వీఆర్వో మహమ్మద్ వలిపై ఫిర్యాదు చేశారు. మాయ మాటలు చెప్పి రెండో వివాహం చేసుకుని గర్భవతిని చేసి, వదిలించుకోవాలని చూస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేశారు. ఇది సాగుతుండగానే షమీమ్ బాను ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలి తండ్రి షేక్ పీర్‌బాషా బుధవారం రాత్రి 9గంటలకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కుమార్తె ఆత్మహత్య విషయంగా మహమ్మద్ వలిపై ఫిర్యాదు చేశాడు. తన కుమార్తెకు మాయ మాటలు చెప్పి రెండో పెళ్లి చేసుకొని గర్భవతిని చేసి వదిలించుకోవాలని చూశాడని, దీంతో తన కుమార్తె మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెలగొండలో హత్య

గుంతకల్లు/టౌన్,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలగొండ గ్రామంలో దాసరి గోవిందు (52)అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవించే దాసరి గోవిందుపై బుధవారం రాత్రి 9గంటల సమయంలో సమీప బంధువైన దాసరి ఓబయ్య కొడవలితో దాడి చేశాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుపై వెళ్తున్న గోవిందును అటకాయించిన ఓబయ్య కొడవలితో నరికాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు రాత్రి నెలగొండ గ్రామానికి తరలి వెళ్లారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

నా కూతురు కనిపించడంలేదు..!

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తన కూతురు కనిపించడం లేదని పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కమతం శివయ్య టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. శివయ్య ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు. రెండో కూతురు నందిని డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఉంటోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి తను కనిపించడం లేదని శివయ్య ఫిర్యాదులో పేర్కొన్నారని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. కేతిరెడ్డి కాలనీలో ఉంటున్న చంద్రశేఖర్‌రెడ్డిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మత్తు మందు చల్లి గొలుసు చోరీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్ బ్యాంకు వీధిలో ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్న కుసుమాంబ అనే మహిళపై దుండగులు మత్తు మందు చల్లి, బంగారు గొలుసును తెంచుకువెళ్లారు. వస్తువులను కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు నటించి బుధవారం ఉదయం బురిడీ కొట్టించారు. ఆమెను మాటల్లోకి దింపి, ముఖంపై పౌడర్ చల్లారు. ఆమెకు మైకం కమ్మగానే మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం గొలుసును తెంచుకుని ఉడాయించారు. బాధితురాలు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ విజయ్ కుమార్, ఇన్‌చార్జి సీఐ మారుతీ శంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక నవోదయ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 9.., 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2026 ఫిబ్రవరి 7న అర్హత పరీక్ష ఉంటుందన్నారు. సెప్టెంబరు 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలలో 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అధ్యాపక పోస్టులకు..

బుక్కపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కాంట్రాక్టు పద్ధతిపై అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మగ్బుల్ హుస్సేన్ బుధవారం తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్, గణితం సబ్జెక్టు బోధించడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఆయా సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ(55 శాతం మార్కులు)ఉండాలన్నారు. పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 11 సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయా లన్నారు. 12న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం 9160044786, 9618853847కు సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

ఆర్టీసీ బస్ స్టాండ్ పునఃప్రారంభం

బత్తలపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన బత్తలపల్లిలో ఆర్టీసీ బస్టాండును పునఃప్రారంభాంచారు. అధికారులు డీపీటీఓ మధుసూదన్, డీఎం సత్యనారాయణ బుధవారం పరిశీలించి ఎక్స్‌కవేటర్‌తో పరిసరాలను శుభ్రం చేయించి బుధవారం సాయంత్రమే బస్సులను బస్‌స్టాండులోకి పంపి ప్రారంభించారు. ఈ బస్ స్టాండ్‌ను 35 సంవత్సరాల క్రితం నిర్మించారు.ఆ తరువాత కొన్నేళ్లకు ప్రారంభించినా, ఆరేడు నెలలు మాత్రమే ఉపయోగించారు. దాదాపు ఇరవై ఏళ్లకు పైగానే నిరుపయోగంగా ఉంది. ఇప్పుడు ఆ బస్ స్టాండును పునః ప్రారంభించడంతో ఆ చుట్టు ప్రక్కల కాలనీవాసులు, మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు నాగశేఖర్, నాగేంద్ర, హుసేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ ఎంపిక

కొత్తచెరువు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీని ప్రకటించారు. వారం క్రితమే అధ్యక్షుడి పూలశివప్రసాద్‌ను ప్రభుత్వం ప్రకటించింది. వైస్ చైర్మన్ తోపాటు మరో 13 మంది డైరెక్టర్లను బుధవారం ప్రకటించింది. వైస్ చైర్మన్‌గా ప్రేమ్‌నాథ్‌రెడ్డి, డైరెక్టర్లుగా నంజప్ప, హేమావతి, జయరాంనాయక్, కంచి సురేశ్, నాగరత్న, మస్తానమ్మ, ప్రవీణ, కిలారిశ్రీనాథ్, మణికుమారి, షేక్ నిజాంవలి, జ్యోతిజయశ్రీ, సుగుణ, తలారి చంద్రమాణిక్యాన్ని నియమించింది. త్వరలోనే నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు తెలుస్తోంది.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయండి


జయశ్రీని అభినందిస్తున్న జీఎం శేఖర్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేసి కూటమి ప్రభుత్వానికి మంచిపేరుతేవాలని కొత్తచెరువు మార్కెట్ యార్డ్ నూతన డైరెక్టర్‌గా ఎంపికైన జ్యోతి జయశ్రీకి బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ సూచించారు. ఆయన బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జయశ్రీని ఘనంగా సన్మానించారు.

టీడీపీతోనే బడుగులకు సముచిత స్థానం


డైరెక్టర్లు హేమావతి, చంద్రమాణిక్యం

బుక్కపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ తోనే బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం సాధ్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పుట్టపర్తి మార్కెట్‌యార్డు డైరెక్టర్ స్థానాలను బుధవారం మండలం నుంచి బడుగు, బలహీనవర్గాలకు చెందిన హేమావతి, చంద్రమాణిక్యాన్ని ఎంపికచేశారు. వారిని టీడీపీ మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు.

మెరుగైన సేవలు అందించండి: డీడీఓ

బత్తలపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మన అందరి బాధ్యత అని డీడీఓ జనార్ధనరావు పేర్కొన్నారు. ఆయన బుధవారం మండలకేంద్రమైన బత్తలపల్లి సచివాలయం-2ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశమయ్యారు. తప్పులు లేకుండా సర్వేలను చేయాలన్నారు. సిటిజన్ కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, పంచాయతి కార్యదర్శి ముత్యాల్‌నాయుడు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

గాండ్లపెంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కటారుపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలను డీఈఓ క్రిష్టప్ప బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, రికార్డుల ను, ఉపాధ్యాయుల వివరాలను, విద్యాబోధనపై ఆరా తీశారు. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన విద్యను బోధించాలని ఉపాధ్యాయు లకు సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాలపై ఆరాతీశారు. ప్రధానోపాధ్యాయులు సరళ, సురేష్, షంషీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాబీ టూల్స్‌పై పోస్టర్ విడుదల

తనకల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం క్యాబీటూల్స్(సెంటర్ ఫర్ అగ్రికల్చర్, బైయో సైన్సెస్ ఇంటర్నేషన్) నిర్వహణపై పోస్టర్లను విడదల చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ... రైతులు తమ పొల్లాలో సాగుచేసిన పంటలకు వస్తున్న వివిధ రకాల తెగుళ్లు, చీడపీడలను గుర్తించి, నివారణ కోసం చేపట్టాల్సిన పద్ధతుల గురించి టూల్స్ యాప్‌ను ఉపయోగించి తెలుసుకోవచ్చన్నారు. సెల్‌ఫోన్ వాడుతున్న రైతులు ఈ యాప్‌ను తమ డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించాలన్నారు.

ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలం: ఏఓ

నంబులపూలకుంట, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రస్తుతం ప్రత్యా మ్నాయ పంటలు సాగుచేయడానికి అనుకూలంగా ఉంటాయని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఇప్పటికే భూములు దుక్కిలు చేసిన రైతులు ప్రత్యామ్నాయ పంటలైన ఉద్ది, ఉలవ, పెసర, కంది, ఆముదం, అలసంద, జొన్న, అనప పంటలు సాగుచేసుకోవచ్చన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

కొత్తచెరువు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అన్న పూర్ణ హోటల్ వెనుక నాయుడు సప్లయర్స్ వద్ద పార్కింగ్ చేసిన స్ప్లెండర్ ప్లస్ బ్లాక్ ఎపి.02.అర్8661 బండి చోరీకి గురైందని అప్‌గ్రేడ్ సీఐ మారుతీశంకర్ బుధవారం తెలిపారు. బుక్కపట్నం మండలకేంద్రానికి చెందిన కత్తే రాజు ధర్మవరం సేల్స్‌ట్యాక్సు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన రోజూ మాదిరాగానే తన ద్విచక్రవాహనాన్ని కొత్తచెరువు లోని నాయుడు సప్లయర్స్ వద్ద ఉంచి విధులకు వెళ్లాడు. విధులు ముగించుకొని వచ్చి చూడగా, అక్కడ బండి కనబడకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేదు. దీంతో తన ద్విచక్రవాహనం కనబడలేదని ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో మద్యం ప్రియులు

కదిరి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురిని బుధవారం డ్రోన్ కెమెరాల సాయంతో గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బాబ్‌జాన్, మహిళా పీఎస్ఐ సుమతి తెలిపారు. ఎస్పీ రత్న, డీఎస్పీ శివనారాయణ స్వామి పర్యవేక్షణలో కదిరి సబ్ డివిజన్ ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై డ్రోన్ సహకారంతో ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఆరుగురిని గుర్తించి అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి: ఎంపీడీఓ

కదిరి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలో అక్రమ లేవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎంపీడీఓ నజీమా తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ప్రవేశపెట్టిందన్నారు. 2025, జూన్ 30 వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లను 90రోజుల్లోగా దరఖాస్తు చేసుకుని రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో కానీ, పంచాయతీ కార్యాయంలో కానీ తెలుసుకోవాలని సూచించారు.

అర్ధాంతరంగా ఆగిన నాడు-నేడు

- వైసీపీ పాలనలోనే నిధులులేక నిలిచిన వైనం
- రెండేళ్లుగా మొండిగోడలకే భవనాలు పరిమితం
- తుప్పు పడుతున్న కడ్డీలు, అదృశ్యమవుతున్న సామగ్రి
- అసౌకర్యాల నడుమ విద్యార్థుల చదువులు


వద్దిరెడ్డిపల్లి పాఠశాలలో నిరుపయోగంగా ఆర్వో ప్లాంటు, విద్యుత్ పరికరాలు

గాండ్లపెంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా నాడు-నేడు పథకం పనులతో పాఠశాలల దశ మారుతుందని ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు ఆశపడ్డారు. పలు పాఠశాల భవనాలు అర్ధాంతరంగా ఆగిపోవడంతో అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. మండలంలోని పాఠశాలల తరగతి గదుల నిర్మాణా లను నూతనంగా చేపట్టి, మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్ది ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా ఉండేలా చేస్తామని గత వైసీపీ పాలనలో అప్పటి పాలకు ఎంతో ఆర్భాటంగా గొప్పలు పలికారు. ఆ మేరకు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథకోన్నత, ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 22 పనులకు రూ.6 కోట్లుపైగా నిధులతో నిర్మాణాలు చేపట్టారు. అయితే అర్ధాంతరంగా నిర్మాణాలు ఆగిపోయాయి. తాళ్లకాలువ, తూపల్లి, నల్లగుట్టతండా, గాండ్లపెంట, పత్రవాండ్లపల్లి, అరమడకవాండ్లపల్లిలోని అంగవాడీ కేంద్రాల నిర్మాణం పూర్తి కాలేదు. అలాగే పెద్ద తండా, రెడ్డివారిపల్లి, వద్దిరెడ్డిపల్లి, గాజులవారిపల్లి, కమతంపల్లి, కోటపల్లి, బనాన్ చెరువుపల్లి, సోమయాజుల పల్లి ప్రాథమిక పాఠశాలలు, సామచేనుబైలు, గాండ్లపెంట, గొడ్డివెలగల ప్రాథమికోన్నత పాఠశాలలు, గాండ్లపెంట, కటారుపల్లి, రెక్కమాను ఉన్నత పాఠశాలు, కేజీబీవీలో అదనపు గదులు, ప్రహరీ, మరుగుదొడ్లు, వంట గదులు తదితర వాటి నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. రెండేళ్ల నుంచి నుంచి వివిధ దశల్లో పనులు ఆగిపోయాయి. దీంత బయట వేసిన ఇసుక, కంకర ఆయా గ్రామాల పరిధిల్లోని ప్రజలు తీసుకెళ్లారని, ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు అర్థం నిధులు వచ్చాయని, నిధులు లేక పనులు నిలిపివేశామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఉపయోగపడని పరికరాలు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పించి నాణ్యమైన భోజనం, విద్య అందించాలని ప్రభుత్వ ఉద్దేశ్యం. దీంతో పలు పాఠశాలలో విద్యార్థులకోసం ఆర్వోప్లాంట్లు, ఎలక్రికల్ సామగ్రి, గ్రీన్ బోర్డులు తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. పలు పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు పూర్తి అయినా, వాటికి రంగులు వేయకపోవడంతో దెబ్బతింటున్నాయి. ఇవేకాకుండా ఆర్వోప్లాంట్లు అమర్చినా, విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కళ్లముందు సామగ్రి ఉన్నా వినియోగంలో లేని పరిస్థితి నెలకుంది. మరికొన్నిచోట్ల వంట గదుల నిర్మాణం ఆగిపోవడంతో మధ్యాహ్న ఏజెన్సీలు ఇళ్ల వద్దే పిల్లలకు భోజనం వండి పాఠశాలలకు తెస్తున్నారు.

నిధులొస్తే పనులు ప్రారంభిస్తాం

ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తే మండలంలో వివిధ దశల్లో నిలిచిపోయిన పాఠశాలల నిర్మాణ పనులను పూర్తి చేస్తామని ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు అంటున్నారు. అలాగే గతంలో వివిధ నిర్మాణాల కోసం తెచ్చిన కడ్డీలు, ఇసుక, కంకర తదితర వాటిని సెలవు రోజుల్లో కొందరు ఎత్తుకెళుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పాఠశాలల్లో నిర్మాణాలకు సహకరించాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు. పలుచోట్ల విద్యార్థులు మరుగుదొడ్లు, నీటి ట్యాంక్‌లు, ప్రహరీ, వంట గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వద్దిరెడ్డిపల్లి, గాండ్లపెంట, అంగన్‌వాడీ కేంద్రాల, పాఠశాలల నిర్మాణాలు నిలిచిపోవడంతో, రంగులు వేయకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా కడ్డీలు, గేట్లు, కిటికీలు తుప్పు పడుతున్నాయి. వీటిని ఇలాగే వదిలేస్తే పనికిరాకుండా పోతాయి. అలాగే వాస్ బేసిన్ల వద్ద కొళాయిలు లేకపోవడంతో ఉపాధ్యాయులే తెచ్చి బిగిస్తున్నారు. అలాగే ఉంటే ఇనుక చువ్వలు, గోడలు దెబ్బతినే అవకాశముంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి రెండోవిడత రూ.16 లక్షలతో ప్రణాళికలు తయారు చేశారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులను సంప్రదించి స్థలాన్ని సేకరించి, నిర్మాణాలు ప్రారంభించారు. వైసీపీ పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో ఆ కేంద్రాల నిర్మాణం ఆగిపోయింది. తిరిగి ఆయా కేంద్రాల్లో విద్యార్థులను కొనసాగించాలని ప్రభుత్వం చెప్పడంతో, ప్రస్తుతం అంగన్‌వాడీకేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే పనులు

ప్రభుత్వం రెండువిడత నాడు నేడు పనులకు అనుమతులు ఇచ్చి, నిధులు ఇస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఆగిన పనులను పూర్తి చేసి, విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం.

\- క్రిష్ణానాయక్, ఎంఈఓ, గాండ్లపెంట


గాండ్లపెంటలో అర్ధాంతరంగా ఆగిన వంట గది

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

- ఎమ్మెల్యే కందికుంట


యాంటీ డ్రగ్స్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కదిరి అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన యాంటీ డ్రగ్స్ పోస్టర్లను ఆయన బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి యువత రేపటి పౌరులన్నారు. వారు డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతోందన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, నాయకులు బాహుద్దీన్, డైమండ్ ఇర్ఫాన్, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు చింతా నాగరాజు, ఉపాధ్యాయ సంఘం సూర్యశేఖర్, రాజేంద్ర, టీఎన్ఎస్ఎఫ్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కదిరి అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు బుధవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. వారు బుధవారం ఎమ్మెల్యేని పట్టణంలోని ఆయన నివాసంలో కలిశారు. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా 20 సంవత్సరాలుగా పరిశోధన కేంద్రంలో దాదాపు 28 మంది మహిళ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి వేతనాలు సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. బడ్జెట్ లేదన్న కారణంలో వారికి పనులు కల్పించకపోగా, మరోవైపు బయట కార్మికులను పనిలోకి తీసుకుంటున్నారని వారు ఎమ్మెల్యేకి విన్నవించారు. సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి నీటి కార్మికుల సమ్మె నోటీసు

నల్లమాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సత్యసాయి నీటిపథకంలో పని చేస్తున్న కార్మికులు బుధవారం తహసీల్దార్ రంగనాయకులు, సీఐ నరేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి త్రివేణికి సమ్మె నోటీసు అందజేశారు. తమకు నాలుగు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. సత్యసాయి నీటి పథకం అధికారులకు, మంత్రులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. తప్పని పరిస్థితిలో తాము సమ్మెకు దిగుతున్నామని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి సమ్మెలోకి దిగుతున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు వెంకటేష్, షామీర్, కేశవ, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల మరమ్మతులు ప్రారంభం

బుక్కపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే అతి పెద్దదైన బుక్కపట్నం చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే ప్రధాన సాగునీటి కాలువల మరమ్మతు పనులను బుధవారం ప్రారంభించారు. చెరువు కింద రైతుల పంటలకు వెళ్లే ప్రధాన కాలువలు ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, మురుగునీటితో నిండిపోయి అధ్వానంగా ఉన్నాయి. నీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారడంతో స్థానిక రైతులు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడంతో ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించారు. నాయకులు పత్తి చంద్ర శేఖర్, పూల శివప్రసాద్, జేశెట్టి సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న వైసీపీ నాయకులు

తాడిమర్రి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ భారీ షాక్ తగిలింది. మండలంలో వైసీపీలో కీలకంగా ఉన్న పలువురు నాయకులు బుధవారం టీడీపీ మండల నాయకులు హర్షవర్దన్, గణేశ్ ఆధ్వర్యంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతపురంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో తాడిమర్రికి చెందిన బండారు నరేంద్ర, పన్నూరు నాగభూషణ, హరిజన నరసింహుడు, తలారి నారాయణస్వామితో పాటు మొత్తం 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి పరిటాలశ్రీరామ్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్న తీరు చూసి టీడీపీలో చేరామని వారు అన్నారు. అలాగే వైసీపీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నా ఎలాంటి గుర్తింపు లేకపోగా తమ ప్రాంతానికి ఎలాంటి మంచి జరగలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పక్కీర్‌రెడ్డి, రంగయ్య, కుళ్లాయరెడ్డి, నాగేంద్ర, ఓబుళేశు పాల్గొన్నారు.

'ప్రజాసంక్షేమమే టీడీపీ లక్ష్యం'

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్‌లు పేర్కొన్నారు. పట్టణంలోని 21, 22, 23, 24 వార్డులలో బుధవారం 'మీ సమస్యమా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి బారీ స్పందన వస్తోందన్నారు. టీడీపీ నాయకులు ఫణికుమార్, చింత పులుసు పెద్దన్న, పురుషోత్తంగౌడ్, నాగూర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరం రూరల్/ తాడిమర్రి: టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్ చౌదరి తదితర నాయకులు బుధవారం మండలంలోని పోతుకుంట గ్రామంలో 'మీ సమస్య-మాబాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే తాడిమర్రి: మండలంలోని ఏకపాదంపల్లిలో బుధవారం 'మీ సమస్య- మా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైతుల కోసమే సంఘాలు : డీఆర్‌డీఏ పీడీ

తనకల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన పంటల ద్వారా లాభం పొందడానికే రైతు సంఘాలను ఏర్పాటుచేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. ఆయన మంగళవారం రాత్రి మండలకేంద్రంలో చౌడేశ్వరీ రైతు ఉత్పత్తిదారుల సంఘం, పాలకవర్గ సభ్యులతో సమావేశాన్ని ఆ సంఘం అధ్యక్షురాలు తోట సరోజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు విడివిడిగా కాకుండా తాము పండించిన పంటలను ప్రాసెసింగ్ చేసి, ఉమ్మడిగా వ్యాపారం నిర్వహించడం ద్వారా లాభాలు వస్తాయన్నారు. రైతులకు కావలసిన ఇన్‌పుట్ వస్తువులను సంఘాల ద్వారా విక్రయించాలన్నారు. తనకల్లులో చౌడేశ్వరీ రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో రైతులకు కావలసిన ఇన్‌పుట్ వస్తువుల దుకాణం ప్రారంభించారు. కార్యక్రమంలో విజయనగరం డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామమోహన్, ఏరియా కోఆర్డినేటర్ రవీంద్ర, ఏపీఎం జయంతి, రమణప్ప, సీసీలు బాబ్‌జాన్, ప్రవీణ్, భాస్కర్, ఎఫ్ఈఓ కార్యదర్శి పెద్దక్క, రైతులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా

నల్లమాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అప్పుటే పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలపై బుధవారం నల్లమాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రామచంద్ర, వెలుగు ఏపీఎం గోపాల్, అంగన్‌వాడీ కార్యకర్తలు, రంగమ్మ, కమలమ్మ, పద్మావతి, లక్ష్మీదేవి, ఆరుణమ్మ, తల్లులు, పిల్లలు, ఆయాలు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమని, డబ్బా పాలు వద్దని సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్ విజయ్‌కుమారి పేర్కొన్నారు. మండలంలోని కొండకమర్ల గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయ ఆవరణంలో సమావేశం ఏర్పాటు చేసి, తల్లిపాల వల్ల కలిగే లాభలు వివరించారు. ఆరోగ్య సిబ్బంది బాలాజీనాయక్, షామూ, కార్యదర్శి మద్దిలేటిరెడ్డి, చంద్రశేఖర్, సర్పంచ్ అల్లాపల్లి శ్రావణి, సెక్టార్ పరిధిలోనిఅంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.



ఓబుళదేవరచెరువులో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీఓ

నేడు జాతీయ చేనేత దినోత్సవం

- విజయవంతం చేయండి: టీడీపీ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కదిరిగేటు వద్ద గురువారం జరిగే జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నట్టు టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చేనేత కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ హాజరవుతారన్నారు. ఉదయం 10గంటలకు కదిరిగేటు వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నిర్వహిద్దామని వారు పేర్కొన్నారు.

ప్రజాపంపిణీని బలోపేతం చేయాలి: ఆర్డీఓ


స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేశ్

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆర్డీఓ మహేశ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం ధర్మవరం మార్కెట్‌యార్డ్‌లో ఉన్న ఎంఎల్ఎస్ స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేశారు. గోదాములో ఉన్న నిత్యావసర సరుకులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించి సరుకుల లభ్యత, పంపిణీ వివరాలను క్రాస్ చెక్ చేశారు. సిబ్బంది పూర్తి నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు నిత్యావసర సరుకులు సమయానికి, పారదర్శకంగా అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దని హెచ్చరించారు. తనిఖీలో గుర్తించిన అంశాలపై తక్షణ చర్యలు తీసుకుని సర్దుబాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు

ఆధార్ లింకులో పొరపాట్లను సరిదిద్దండి

● ధర్మవరం రూరల్: ఆధార్‌లింకులో పొరపాట్ల వల్ల అర్హులైన వారికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించలేదని తమ దృష్టికి వచ్చిందని, వెంటనే ఆ పొరపాట్లును సరిదిద్దాలని ఆర్డీఓ మహేష్ సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయన బుధవారం మండలంలోని సీసీకొత్తకోట గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయానికి వచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు. దీంతో తమ ఖాతాకు వేరేవాళ్ల ఆధార్ మ్యాచింగ్ కావడంతో తమకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించలేదని ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన సిబ్బందితో ఆధార్‌సీడింగ్ సమస్యపై సమీక్ష నిర్వహించారు. దగ్గరుండి రైతులకు ఆధార్‌లింకు చేయించారు.

విచారణ పూర్తిచేయాలి: ఎస్టీయూ

కొత్తచెరువు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులపై పెండింగ్‌లో ఉన్న విచారణను పూర్తి చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గుజ్జల హరిప్రసాద్‌రెడ్డి విద్యాశాఖ ఏడీ శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆయన బుధవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఏడీని కలిశారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యయులకు ఇచ్చిన సస్పెన్షన్లు, చార్జ్‌మెమోలకు సంబంధించి విచారణను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారన్నారు. వాటిని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2025 బదిలీఉపాధ్యాయులకు పొజిషియన్ ఐడీలు, క్యాడర్ సంఖ్య పనులను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులను పూరిగా బోధనకే పరిమితం చేయాలన్నారు. ఉపాధ్యాయులు చరణ్, ఖాసింసాబ్, సురేంద్రనాయుడు, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

'చేనేతలకు ప్రభుత్వాల శఠగోపం'

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శఠగోపం పెట్టాయని చేతివృత్తుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ విమర్శించారు. వారు బుధవారం సానిక చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చేనేత కార్మికులను ఆదుకోవడానికి తెచ్చిన 1985 చేనేత రిజర్వేషన్‌చట్టం ఇప్పుడు నేత కార్మికులను పక్కన పడేసి మాస్టర్ వీవర్స్ చేతుల్లోకి ఒక ఆయుధంగా మారిందన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పవర్‌లూమ్స్‌లో ఉత్పత్తి చేసిన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా అమ్ముకుంటున్నారన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు వెంకటస్వామి, శ్రీనివాసులు, రంగయ్య పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో సంస్కృతి విద్యార్థుల సత్తా


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హిందూపురం ఎంజీఎం కళాశాల మైదానంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో సంస్కృతి స్కూల్‌ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు సత్తాచాటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రాము తెలిపారు. మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కళాశాలకు చెందిన ఈఈఈ విభాగం విద్యార్థులు సుమంత్‌రెడ్డి, హేమంత్‌కుమార్‌నాయక్, హర్షవర్ధన్ ఉత్తమప్రతిభ కనపరిచారన్నారు. వీరు ఈ నెల 12న తిరుపతిలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వారిని జిల్లా క్రీడల అధికారి ఉదయ్‌బాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమచంద్ర, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

జాతీయ కరాటే పోటీలకు ధర్మవరం విద్యార్థి


ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న యశోద పాఠశాల డైరెక్టర్

ధర్మవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక యశోద పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువు తున్న మహీధర్ జాతీయ కరాటే క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ పృధ్వీరాజ్ తెలిపారు. పాఠశాలలో బుధవారం విద్యార్థి మహీధర్‌ను డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ అనూప్, కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా, విద్యార్థి తండ్రి వెంకటేశ్వర ప్రసాద్ అభినందించారు.

చెరువులోకి మట్టిని తరలించకుండా చర్యలు

కొత్తచెరువు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో ఉన్న బుక్కపట్నం చెరువులోకి కొందరు వృథామట్టిని తరలిస్తున్నారు. దీంతో చెరువు కుంచించుకుపోతోంది. దీనిని అరికట్టడానికి బుక్కపట్నం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు పీవీ నవీన్‌కుమార్, జేఈ గీతాబాయి, డైరెక్టర్లు పెరుమాళ్ల మధు, చలపతి చర్యలు చేపట్టారు. చెరువులోకి మట్టిని తోలకుండా ఎక్స్‌కవేటర్లతో కాలువను అడ్డుగా తవ్వించారు. ఎవరైన మట్టిని చెరువులోకి తరలిస్తే వారిపై పోలీసు కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. చెరువును పూడ్చడం వల్ల ఆయకట్టుకు నీరు తక్కువ అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. కావున చెరువులోకి మట్టిని తరలించరాదని సూచించారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

● రూ.1.73 కోట్లతో కోనాపురం రోడ్డు

పెనుకొండ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా గుంతలమయంగా మారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోనాపురం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మంత్రి సవిత ప్రత్యేక చొరవ తీసుకోవడంతో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మడకశిర రోడ్డు నుంచి నారాయణమ్మ కాలనీ మీదుగా, కొండాపురం క్రాస్‌వరకు బీటీఎస్ ఎల్ఆర్ఎస్ 15వ ఫైనాన్స్ రూ.1.73కోట్ల నిధులు మంజూరయ్యాయి. మడకశిర రోడ్డు నుంచి నారాయణమ్మ కాలనీ మీదుగా కొండాపురం క్రాస్ వరకు డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.83లక్షలు, సీసీరోడ్డుకు రూ.50 లక్షలు, కొండాపురం క్రాస్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు రూ.40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

స్మార్ట్‌మీటర్లు వద్దు: సీపీఐ

పెనుకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లు వద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బుధవారం సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో కార్యకర్తలు, రైతులు, స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు బిగించవద్దని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి రమేష్, క్రిష్టప్ప, మల్లికార్జున, నరసింహ, వెంకటరాముడు, జాఫర్, అలివేలమ్మ పాల్గొన్నారు.

10న ఉచిత గుండె వైద్యశిబిరం

గోరంట్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 10న ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకుడు నిమ్మల శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం మార్క్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్, బీపీ, ఇసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధితుడికి పరామర్శ

అమరాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిడ్రగట్ట గ్రామంలో టీడీపీ నాయకుడు ఆల్‌గుండేగౌడ్ తీవ్ర అనారోగ్యానికి గురికాగా అతడి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఆయన వెంట కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎన్ గణేష్, మండల ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్ ఉన్నారు.

గుడిబండ, (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తిమ్మప్ప విద్యుదాఘాతంతో మృతిచెందాడు. విషయాన్ని తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి బుధవారం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మెడికల్ అసెస్మెంట్ క్యాంపు



మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

మడకశిర టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం విద్యార్థులకు అలింకో ఆధ్వర్యంలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. ఐఈ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మెడికల్ అసెస్మెంట్ క్యాంపు ద్వారా కావాల్సిన ఉపకరణాలకు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాస్‌భాస్కర్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆగివున్న లారీని ఢీకొన్న కారు

పెనుకొండ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమేశ్వర పురం వద్ద 44వ జాతీయరహదారిపై కారు ఆగి ఉన్న లారీని ఢీకొందని ఎస్ఐ వెంటకేశ్వర్లు తెలిపారు. కర్నూలుకు చెందిన సుధాకర్‌రెడ్డి కారులో బెంగళూరుకు వెళ్తున్నారు. పెనుకొండ సమీపంలోని పరమేశ్వరపురం వద్దకు రాగానే జాతీయరహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ప్రమాదంలో సుధాకర్‌రెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'అభివృద్ధిని చూసి టీడీపీలో చేరా'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల

అగళి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సీఎం నారాచంద్రబాబునాయుడు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై తెలుగుదేశం పార్టీలో చేరానని అగళి మండలం ఆర్‌జిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నాగరాజు తెలిపారు. మడకశిరలోని తెలుగుదే శం పార్టీ కార్యాలయంలో బుధవారం స్థానిక సర్పంచ్ సన్నమ్మ రం గయ్య ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నాగరాజుకు మా జీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిపార్టీకండువాకప్పిఆహ్వానించారు.

రక్తదానం ఆవశ్యకతపై అవగాహన

పెనుకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రక్తదానం ఆవశ్యకతపై స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్‌క్లబ్, ఎన్‌సీసీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్, కమ్యూనిటీహెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ హరీష్‌బాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ హరిప్రసాద్, ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, ఎన్ఎస్ఎస్ పీఓ జయప్ప, కాంతరావు, ప్రతాప్ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

చిలమత్తూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం ఉద్రిక్తత నెలకొంది. హిందూపురం పట్టణంలోని ఓ భూమిని చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసేందుకు స్లాట్ బుక్ చేసుకున్నారు. ఆ భూమికి సంబంధించి 14 మంది హక్కుదారులు చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. ఈ 14 మందిలో ఓ వ్యక్తి మరికొంత మంది వద్ద డబ్బులు తీసుకొని వేరే భూమిని రిజిస్ట్రేషన్ చేయించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని, అతడు చిలమత్తూరుకి వస్తాడన్న సమాచారంతో గతంలో ఆయనకు డబ్బులు ఇచ్చి అగ్రిమెంట్లు చేసుకున్న వారు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయ్యాక ఆయన బయటికి వస్తుండగా హిందూపురానికి చెందిన బాధితులు నిలదీశారు. తమ వద్ద డబ్బులు తీసుకున్నావని, రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రశ్నించారు. ఈ సందర్భంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపారు.

భారీ వర్షం.. రైతుల హర్షం

వేరుశనగ సాగులో బిజీ.. బిజీ



వర్షం రావడంతో జీవం పోసుకుంటున్న వేరుశనగ పంట

మడకశిర, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన రెండు నెలల తరువాత వర్షం పడడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. నియోజకర్గంలో 28 వేల హెక్టార్లకు గాను 15 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు అయ్యాయి. అందులో వేరుశనగ 12 వేల హెక్టార్లలో సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభంలో సాగు చేసిన పంటలకు వర్షం లేక ఎండుముఖం పడుతున్న సమయంలో వర్షం పడడంతో పంటలకు ఊపిరి పోసినట్లు అయిందని రైతులు అంటున్నారు. వేరుశనగ సాగు చేసేందుకు భూమిలో తేమ బాగుండడంతో రైతన్నలు వేరుశనగ సాగుకి సన్నద్ధం మయ్యారు. గత ఏడాది వర్షం కురవకపోవడంతో వేరుశనగ సాగు కూడా విడతల వారీగా చేయాల్సి వచ్చింది. అయితే కొంత మంది రైతులు మాత్రం ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకుమొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలో భారీగా వర్షం కురిసింది. పొలాల్లో సైతం నీరు నిల్వ ఉండే విధంగా వర్షం పడింది. వేరుశనగ పంటను ఈనెల 15వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చని, కంది, ఆముదం పంటలను నెలాఖరు వరకు సాగు చేయవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పొలాల్ని బీడుగా వదిలేవాళ్లం

గత యేడు వేరుశనగ పంట దెబ్బతిని నష్టపోయామని, ఈ ఏడైనా ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసి అప్పుల ఊబినుంచి బయటపడదామని గంపెడు ఆశతో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. అప్పులు చేసి వేరుశనగ సాగుకు సిద్ధం అయితే రెండు నెలలైనా వర్షం కురవలేదని, రెండు రోజులుగా వర్షం బాగా పడటంతో తిరిగి సాగుకు సిద్ధమవుతున్నామంటున్నారు. వర్షం పడకపోయివుంటే పోలాలను బీళ్లుగా వదిలేసేవాళ్లమని, వరుణదేవుడు కరుణించడంతో వేరుశనగ సాగు చేస్తున్నామని పేర్కొంటున్నారు.

వర్షం పడటంతో ఆనందపడ్డా..



వర్షం పడకపోయివుంటే పంట ప్రారంభంలోనే ఎండకుని పోయి నష్టం వాటిల్లేది. రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేసి 20 రోజులు అవుతోంది. అప్పటి నుంచి వర్షం పడలేదు. రెండు రోజుల క్రితం వర్షంపడటంతో పంటకు ఊపిరి పోసినట్లు అయ్యింది. పంట ఎండకుని పోయింటే రూ.20 వేలు దాక నష్టం వాటిల్లేది. వర్షం పడడంతో ఆనందపడ్డా.

-మారన్న, రైతు, కొత్తపాళ్యం

15వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చు

నియోజకర్గంలో 28 వేల హెక్టార్లు నార్మల్ ఏరియా ఉండగా అందులో ఇప్పటి వరకు 15 వేల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో 12వేల హెక్టార్లలో వేరుశనగ సాగయ్యింది. ఆగస్టు 15వ తేదీ వరకు వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చు. కంది , ఆముదం పంటలు నెలాఖరు వరకు చేయవచ్చు.

-కృష్ణమీనన్, వ్యవసాయశాఖ ఏడీ

ప్రజాధనం వృథా

వైసీపీ హయాంలో రూ.లక్షలు వెచ్చించి.. చెక్‌పోస్టుల నిర్మాణం

ఆ తర్వాత మూత.. కరెంటు బిల్లు కట్టేవారు కరువు

మడకశిర రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అక్రమ ఇసుక, మద్యం రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో వీటిని తెరిచారు. వీటి కోసం ప్రత్యేకంగా షెడ్లను నిర్మించారు. ప్రత్యేక విద్యుత్‌లైన్‌లాగి సౌకర్యాన్ని కల్పించారు. ఏడాది తిరగకుండా వాటిని మూసేశారు. అనాలోచిత చర్యతో రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని ప్రజలు అంటున్నారు. నిరుపయోగంగా ఉన్న షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయని వారు విమర్శిస్తున్నారు. నియోజకవర్గం కర్ణాటకకు సరిహద్దు ప్రాంతం కావడంతో మడకశిర, రొళ్ల, గుడిబండ, అమరాపురం, అగళి మండలాలవ్యాప్తంగా 32 సరిహద్దు చెక్‌స్టులను అప్పటి వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి చెక్ పోస్టును ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో రూ.లక్షలు వెచ్చించి మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వాటిని ఏడాది తిరగకుండా మూసివేశారు. కొన్ని చెక్‌పోస్టులకు సంబంధించి కరెంటు బిల్లులను చెల్లించారని, కొన్నింటికి చెల్లించలేదని విద్యుత్‌శాఖ అధికారులు అంటున్నారు. రూ.1.20 లక్షల బకాయిలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

దిష్టిబొమ్మల్లా చెక్ పోస్టు షెడ్లు

వైసీపీ పాలనలో ఏర్పాటైన చెక్‌పోస్టులు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. ఒక్కొక్క చెక్‌పోస్టు ఏర్పాటుకు రూ. 75 వేల నుంచి లక్ష వరకు ఖర్చుచేశారు. 32 చెక్‌పోస్టులకు రూ. 18 నుంచి రూ. 20 లక్షల వరకు ఖర్చుచేశారు. ఏడాది తిరగకుండా వాటిని మూసివేయడంతో ప్రజాధనం దుర్వినియోగం అయినట్లైంది.



గుండమల క్రాస్ వద్ద నిరుపయోగంగా ఉన్న చెక్‌పోస్టు షెడ్డు



-గిరి, రైతు, టీడీపల్లి

రూ.1.20 లక్షలు బకాయి



ఐదు మండలాల్లో 2021లో మైనింగ్‌శాఖ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. అందుకు సంబంధించి విద్యుత్ బకాయిలను చెల్లించాల్సి ఉంది. కొన్ని బకాయిలు కట్టేశారు. ఇంకా రూ. 1, 20, 249 విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది.

-రఘు, విద్యుత్‌శాఖ ఏడీ, మడకశిర

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి రైలుకిందపడి మృతిచెందాడు. మృతదేహం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచగా ఎవరూ రాకపోవడంతో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు యుగంధర్ స్పందించి బుధవారం మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): క్రీడలు గెలుపోటములేకాదు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. బుధవారం ఎంజీఎం పాఠశాలలో నేషనల్ స్పోర్ట్స్‌డే సందర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జోన్, రాష్ట్రస్థాయి పోటీలకోసం ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి 350 మంది పాల్గొన్నారు. ఈ నెల 11 నుంచి 15 వరకు తిరుపతిలో నిర్వహించే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అక్కడ గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా డీఎస్‌పీఓ ఉదయ్‌భాస్కర్, ఎంజీఎం హెచ్‌ఎం రంగనాయకులు, మొరార్జియాదవ్, శివకుమార్, సురేష్, పీడీలు పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై అవగాహన కల్పించండి

విద్యుత్‌శాఖ రాష్ట్ర డైరెక్టర్ గురువయ్య

హిందూపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని విద్యుత్‌శాఖ రాష్ట్ర డైరెక్టర్ గురువయ్య, ఎస్ఈ సంపత్‌కుమార్ సూచించారు. బుధవారం ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 9గంటలు నిరంతరంగా విద్యుత్ సరఫరా అందించాలన్నారు. కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు వెంటనే మంజూరు చేయాలన్నారు. వారికి అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్సీఎస్టీ వినియోగదారులు ఇంటిపై సౌరప్యానల్ ఏర్పాటుచేసేందుకు వారి నుంచి సమ్మతిపత్రం తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

ధరంపాల్ పేరు పెట్టండి: జేడీఎస్



మున్సిపల్ అధ్యక్షుడికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పావగడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డును కుమారస్వామికి బదులుగా ధరంపాల్ లేఅవుట్‌గా పేరు పెట్టాలని జేడీఎస్ నాయకులు మున్సిపల్ అధ్యక్షుడు సుదేష్‌బాబును కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, అధికారుల నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జేడీఎస్ జిల్లా అధ్యక్షులు అంజినప్ప, ప్రధాన కార్యదర్శి సోగుడు వెంకటేశ్ మాట్లాడుతూ 18ఏళ్లపాటు ఎస్ఎన్‌కే సంఘం అధ్యక్షుడిగా, మున్సిపల్ అధ్యక్షుడిగా సేవలందించిన దివంగత జీఎస్ ధర్మపాల్ పేరును ఖరారు చేయాలన్నారు. అదేవిధంగా తాలూకా అధ్యక్షుడు ఈరన్న ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నిరసనలో జేడీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నగదు ఇప్పించండి

మూగదాలకొండ రైతులు



పంటను చూపుతున్న రైతులు

పావగడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కీరదోసకాయ, పత్తి పంటలను కొన్ని కంపెనీల మాటలు విని ఒప్పందాల మేరకు సాగుచేశామని, దిగుబడి తీసుకెళ్లి డబ్బు చెల్లించకుండా కంపెనీల చుట్టూ దళారులు తిప్పుతున్నారని మూగదాలకొండ గ్రామరైతులు అన్నారు. తమకు డబ్బు ఇవ్వాలని, ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని వారు పేర్కొన్నారు. మూడు ఎకరాల పొలంలో కీరదోసకాయ పంటను అప్పు చేసి సాగుచేశామని, హైదరాబాద్‌కు చెందిన కంపెనీకి సరుకును ఇచ్చామన్నారు. సరుకు తీసుకుని ఇంత వరకు నగదు చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి రైతులకు కూడా నగదు చెల్లించలేదని, ప్రభుత్వం చర్యలు తీసుకుని తమ నగదును ఇప్పించాలని వారు కోరారు.

'ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలి'

గుడిబండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలు కోరాయి. తహసీల్దార్ కార్యాలయానికి పెద్దఎత్తున ర్యాలీగావచ్చి డీటీ కల్యాణ్‌చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. బడుగుబలహీన వర్గాల కోసం ఆర్డీటీ చేస్తున్న కృషి అమోఘమన్నారు. ఇలాంటిసంస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సోమన్న, హనుమంతరాయప్ప, మంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు నవోదయ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

లేపాక్షి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్‌నవోదయ పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడాపోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఇటీవల మహారాష్ట్ర, కేరళ, హర్యాణా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన క్లస్టర్ రీజినల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జూడో పోటీలకు ఆరుగురు, క్రికెట్‌కు సంబంధించి ఐదుగురు, యోగాకు ఇద్దరు, ఖోఖో పోటీలకు ఒకరు, బాస్కెట్‌బాల్‌కు ముగ్గురు ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ప్రజాభీష్టమే పాలనకు దిక్సూచి: టీడీపీ



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాభీష్టం మేరకే ప్రభుత్వం పనిచేస్తుందని తెలుగుదేశం నాయకులు అన్నారు. బుధవారం హిందూపురం మండలంలోని కొటిపిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. దీనికి మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచల్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, కన్వీనర్ రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్న తరుణంలో చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటే నెరవేరుస్తున్నారన్నారు. మహిళలకు ఈనెల 15నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. చదువుకునే ప్రతి బిడ్డకు తల్లికి వందనం అందిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద అర్హులైన ప్రతి రైతుకు రూ.7వేలు జమ అయ్యాయన్నారు. మూడు సిలెండర్లు ఏడాదికి ఉచితంగా ఇస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రతి పల్లెకు సీసీరోడ్లు నిర్మాణం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉమాశంకర్‌రెడ్డి, టీడీపీ మండల కోఆర్డినేటర్ మంజునాథ్, రామక్రిష్టారెడ్డి, హనుమంతు, శ్రీరామప్ప, రషీద్, అంజినరెడ్డి, రామక్రిష్ణ, చిక్కీరప్ప, ఆదినారాయణ, రామగిరి సూరీ, అంజినేయులు, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

నూతన పారిశ్రామిక విధానం.. ప్రయోజనకరం

జిల్లాపరిశ్రమల శాఖ అధికారి నాగరాజు



మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్

హిందూపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన పారిశ్రామిక పాలసీ ఎంతో ప్రయోజనకరంగా ఉందని జిల్లాపరిశ్రమలశాఖ అధికారి నాగరాజు అన్నారు. బుధవారం హిందూపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ర్యాప్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ రమేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు తీసుకొచ్చిన పాలసీలు యువ పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూరేలా ఉందన్నారు. మేధోసంపత్తి హక్కులు ఎలా రిజిష్టర్ చేసుకోవాలో తెలియజేశారు. వాటి ప్రాముఖ్యత, సమస్యల పరిష్కారం వివరించారు. పరిశ్రమలు రావడంవల్ల ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరించడమే లక్ష్యం

ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య

చిలమత్తూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సోమఘట్టలో పల్లె నిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటికి పరిష్కారాలను చూపాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనరసప్ప, తిప్పారెడ్డి, బేకరీ గంగాధర్, బాలాజీ, శ్రీదేవి, మంజు పాల్గొన్నారు.

కొటిపిలో రేషన్ దుకాణం ప్రారంభం



రేషన్ షాపును ప్రారంభిస్తున్న వీరయ్య

హిందూపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలోని కొటిపిలో రెండు చౌక ధాన్య డిపోలు ప్రారంభించారు. ఎమ్మెల్యే పీఏ వీరయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థ నారాయణరెడ్డి, అరుణాచల్‌రెడ్డి వీటిని ప్రారంభించారు. గతంలో నిర్వహిస్తున్న చౌకధాన్య డీలర్లు అవకతవకలకు పాల్పడటంతోవారిపై కేసు నమోదుచేసి వేరేవారికి డిపోను అందించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కార్డుదారులకు ఇబ్బందిలేకుండా మెరుగ్గా సౌకర్యాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాము, టీడీపీ నాయకులు ఉమాశంకర్‌రెడ్డి, రవి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి: ఏఐటీయూసీ

పెనుకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల్లో పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు, కమిషనర్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. బుధవారం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందిస్తూ, ఆప్కాస్ కార్మికులకు రెండు నెలలుగా, క్లాప్‌మిత్రలకు మూడు నెలలుగా ఇ టీవల విధుల్లో చేరిన డెయిలీవేజ్ కార్మికులకు ఎనిమిది నెలలుగా జీతాలు పెం డింగ్‌లో ఉన్నాయన్నారు. జీతాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

పరిగి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇండియన్ గార్మెంట్స్ వద్ద హిందూపురం, మడకశిర రహదారిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలు అయినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. పరిగి గ్రామానికి చెందిన శ్రీధర్ హిందూపురం వైపు వస్తుండగా అదే గ్రామానికి చెందిన అక్షయ్, జయలక్ష్మీ మరో ద్విచక్రవాహనంలో వెళ్తూ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్వికచక్రవాహనాన్ని ఢీకొట్టారు. ప్రమాదంలో అక్షయ్, జయలక్ష్మీలకు తీవ్రగాయాలయ్యాయి. పెనుకొండ సీఐ వాహనంలో హిం దూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.